జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు
9440231967

కృష్ణ గురువారం 8 అక్టోబర్ 2026 సంపుటి : 01 సంచిక :265 పేజీలు : 12 వెల : 3/- PRGI No. APTEL/26/A0119,

శ్రీ పరాభవ నామ సంవత్సరం ఆషాఢ మాసం గ్రీష్మ ఋతువు దక్షిణాయణం సూర్యోదయం: 5.42 । సూర్యాస్తమయం: 6.22 చంద్రోదయం: 4.57 । చంద్రాస్తమయం: 5.20 తిథి: బహుళ చతుర్దశి రా. 1.37 వరకు, తదుపరి అమావాస్య నక్షత్రం: పుష్యమి సా. 10.23 వరకు, తదుపరి ఆశ్లేష యోగం: సిద్ధి రా. 8.18 వరకు, తదుపరి వ్యతీపాత కరణం: భద్ర మ. 2.45 వరకు, తదుపరి శకుని రా. 1.37 వరకు, తదుపరి చతుష్పాద

Published from KRISHNA, GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

## కోట్లాది మంది భారతీయుల విశ్వాసమే నా అతిపెద్ద బలం

- ప్రభుత్వాధినేతగా 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రధాని మోదీ వినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు
- 'సేవే లక్ష్యంగా స్వయంసేవకులు'
- తాను ఎప్పుడూ ఒంటరిగా భావించలేదు
- దేశ సాంస్కృతిక ఆత్మను కాపాడుతూ, భారత్‌కు సేవ చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్న అనేక మంది స్వయంసేవకులు, కార్యకర్తలు తనకు అండగా ఉన్నారు.
- ఒకప్పుడు మనకు ఉగ్రవాదం పెనుముప్పుగా ఉండేది
- ఇప్పుడు భారత్ అభివృద్ధి దిశగా వేగంగా పరుగులు పెడుతోంది



## ఎన్నికల కమిషనర్ల నియామకాల తీర్పు రికాల్‌పై పిటిషన్



- స్వీకరించిన సుప్రీంకోర్టు
- ఎన్నికల కమిషనర్ల నియామక చట్టంపై సుప్రీంకోర్టులో మరో కీలక మలుపు
- నాటి తీర్పును వెనక్కి తీసుకోవాలంటూ పిటిషన్ దాఖలైంది
- పిటిషన్‌ను పరిశీలిస్తామని ప్రధాన న్యాయమూర్తి వెల్లడి



## త్వరలో డీపీఆర్

- గోదావరి డెల్టాలో రూ.13.4 కోట్లతో లైడార్ సర్వే పూర్తి
- గోదావరి డెల్టా ఆధునీకరణ, శాశ్వత ముంపు సమస్య పరిష్కారంపై మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులతో సమీక్షించారు.
- రూ.13.4 కోట్లతో నిర్వహించిన లైడార్ సర్వే ఆధారంగా డీపీఆర్ సిద్ధం
- రూపొందుతున్న సమగ్ర ప్రాజెక్టు నివేదిక
- అవసరమైన నిధులను మంజూరు చేసేందుకు చర్యలు

అమరావతి

గోదావరి డెల్టా ప్రాంతంలో ఏటా వస్తున్న ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధునీకరణ పనులకు పకడ్బందీ కార్యాచరణ సిద్ధం చేస్తోంది. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అమరావతిలోని తన క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్ అధికారులు, సాంకేతిక నిపుణులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రూ.13 కోట్ల 40 లక్షల భారీ వ్యయంతో - మిగతా3లో

## మీడియాకు స్పష్టంగా
# వివరించాలి



- ప్రజల మాట వింటేనే ఎక్కువకాలం జనంలో ఉంటారు
- కేబినెట్ భేటీ అనంతరం చంద్రబాబు, మంత్రులతో పలు అంశాలపై చర్చలు
- జగనన్న కాలనీల్లో ఖాళీ ప్లాట్లు ఉంటే ఇతరులకు కేటాయించాలని సీఎం ఆదేశించారు
- కర్మయోగి కార్యక్రమంలో భాగంగా సిబ్బందికి మంత్రులు శిక్షణ ఇవ్వాలని

అమరావతి

సచివాలయంలో మంత్రివర్గ భేటీ అనంతరం తాజా పరిమాణాలపై మంత్రులతో సీఎం చంద్రబాబు చర్చించారు. జగనన్న కాలనీల్లో ఖాళీగా ఉన్న ప్లాట్లకు ఇక కొత్త కేటాయింపులు, లబ్ధిదారులకు మరింత వెసులుబాటు కల్పించేలా కేబినెట్ సబ్‌కమిటీ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. ఇల్లు కట్టుకునేందుకు ఆసక్తి ఉన్నవారికి ప్లాట్లు ఇవ్వాలని చెప్పారు. ప్లాట్లు దక్కిన వారు తమకు అక్కర్లేదంటే మరో ప్రాంతంలో - మిగతా3లో



ఎంపీలను కొడతారా

## ఇక్కడి నుంచి కదిలేదే లేదు

- నేలపై పడుకొని ప్రియాంక గాంధీ నిరసన
- జంతర్ మంతర్‌వైపు వెళ్తున్న ఇండియా కూటమి ఎంపీలను అడ్డుకున్న ఢిల్లీ పోలీసులు
- నేలపై పడుకొని నిరసన తెలిపిన ప్రియాంక గాంధీ
- పోలీసులు తనను గాయపరిచి కింద పడేశారని ఆగ్రహం!



## యూపీ పీసీసీ అధ్యక్షురాలిగా ఆరాధన మిశ్రా..

- బ్రాహ్మణ ఓట్లపై కాంగ్రెస్ గురి
- యూపీ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా బ్రాహ్మణ నేత ఆరాధన మిశ్రా నియామకం
- బ్రాహ్మణ ఓటర్లను ఆకర్షించేందుకు కాంగ్రెస్ పాత వ్యూహం
- 2017లోనూ ప్రశాంత్ కిశోర్ సలహాతో ఇదే ప్రయోగం విఫలం

## ఓటర్ల జాబితాపై
# ప్రత్యేక డ్రైవ్



- 'అనర్హులను తొలగించడమే లక్ష్యం'
- సర్ ప్రక్రియలో ఓటర్ల జాబితా నుంచి అనర్హులుగా గుర్తించినవారిని గురువారం నుంచి బీఎల్‌ఓలు బూత్ స్థాయిలో పరిశీలన చేయనున్నారు.
- ఈ మేరకు ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది.
- నేటి నుంచి సర్ ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని సీఈవో నిర్ణయం

అమరావతి

ఏపీలో సర్' ప్రక్రియలో భాగంగా ఓటర్ల జాబితా నుంచి అనర్హులుగా గుర్తించినవారిని నేడు (గురువారం) నుంచి బీఎల్‌ఓలు బూత్ స్థాయిలో పరిశీలన చేయనున్నారు. ఈ మేరకు నేటి నుంచి ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్లు ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రధాన అధికారి వివేక్‌యాదవ్ వెల్లడించారు. ప్రతి అర్హతగల ఓటర్‌ను చేర్చి, ఓటర్ల జాబితాలో అనర్హుల నమోదులు ఏవీ మిగిలిపోకుండా చూడాలన్న భారత ఎన్నికల సంఘం లక్ష్యానికి అనుగుణంగా ఈ ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్లు వివరించారు. రాష్ట్రంలో ప్రత్యేక విస్తృత సవరణ, 2026 కింద జరిగిన గణన దశలో, బీఎల్‌ఓలు 15 జూన్ నుంచి 24 - మిగతా3లో



## ఢిల్లీలో కుప్పకూలిన 5 అంతస్తుల భవనం

- గర్భిణి, చిన్నారితో సహా ముగ్గురు మృతి
- సీమాపురిలో భవనం కుప్పకూలిన ఘటనలో ముగ్గురు మృతి
- మరో ఎనిమిది మందికి గాయాలు

# డ్రగ్స్‌పై యుద్ధం..

- సమిష్టిగా కదులుదామన్న మంత్రి లోకేశ్
- ఆంధ్రప్రదేశ్‌ను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు కార్యాచరణ
- 'ఆపరేషన్ చైతన్యం', 'డ్రగ్స్ వద్దు బ్రో' కార్యక్రమాల విస్తరణకు ఆదేశం
- డ్రగ్స్ నివారణపై సమన్వయం కోసం త్వరలో దక్షిణాది రాష్ట్రాల కాంక్లేవ్
- అవగాహన కల్పించేందుకు మంత్రుల బృందం క్షేత్రస్థాయి పర్యటనలు
- గంజాయి రవాణాపై ఉక్కుపాదం, సరిహద్దుల్లో నిఘా పటిష్టం



అమరావతి

ఆంధ్రప్రదేశ్‌ను మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వం తన కార్యాచరణను ముమ్మరం చేసింది. డ్రగ్స్ నిర్మూలనపై హోంమంత్రి వంగలపూడి అనిత అధ్యక్షతన ఉండవల్లిలో జరిగిన మంత్రుల బృందం సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ఈ లక్ష్యాన్ని సాధించాలని ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు మంత్రుల బృందం క్షేత్రస్థాయిలో పర్యటించాలని - మిగతా3లో

# 22వ రోజుకు చేరిన వీఆర్ఏల పోరుబాట

## న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు ఉద్యమం ఆగదు

### --- ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్



**బనగానపల్లె:అక్టోబర్=07 ప్రజాజ్యోతి** బనగానపల్లె, అక్టోబర్ 7: నంద్యాల జిల్లా బనగానపల్లె మండలంలో గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్ఏలు) తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన నిరవధిక ధర్నా 22వ రోజుకు చేరుకుంది. బనగానపల్లె ఎంఆర్ ఒ కార్యాలయం ఎదుట వీఆర్ఏలు శాంతియుతంగా ఆందోళన కొనసాగిస్తూ తమ డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతున్నారు.

**వీఆర్ఏల ప్రధాన డిమాండ్లు**

వీఆర్ఏలకు పే స్కేలు అమలు చేయాలని, నామినీలుగా పనిచేస్తున్న వీఆర్ఏలందరికీ ఒకేసారి ఉద్యోగ నియామకాలు కల్పించాలని, అర్హులైన వీఆర్ఏలకు 70 శాతం ప్రమోషన్లు కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. విధి నిర్వహణలో మృతి చెందిన వీఆర్ఏల కుటుంబ సభ్యులకు వయోపరిమితితో సంబంధం లేకుండా ఉద్యోగాలు కల్పించాలని కోరుతున్నారు.

**ప్రభుత్వానికి బలమైన పిలుపు**

22 రోజులుగా వీఆర్ఏలు శాంతియుతంగా ఆందోళన చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఇకనైనా స్పందించాలి. వీఆర్ఏల డిమాండ్లను కేవలం హామీలకే పరిమితం చేయకుండా, సంఘం ప్రతినిధులతో వెంటనే చర్చలు జరిపి ప్రతి సమస్యకు స్పష్టమైన పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు. తమ న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం తక్షణ నిర్ణయం తీసుకుని వీఆర్ఏలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారంలో జాప్యం చేయకుండా ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని, వీఆర్ఏల కుటుంబాలకు భరోసా కల్పించాలని వారు కోరారు. తమ డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు ఐక్యంగా, శాంతియుతంగా పోరాటాన్ని కొనసాగిస్తామని వీఆర్ఏలు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏ సంఘం అధ్యక్షుడు గౌస్ పీరా, తలారి బాలుడు,తలారి సుబ్రహ్మణ్యం,కే .హరిబాబు,తలారి శ్రీనివాసులు,తలారి బాలకృష్ణ, శేషు, మహమ్మద్ గౌస్,తదితర వీఆర్ఏలు పాల్గొన్నారు.

## వీఆర్ఏల తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని 22వ రోజు ఆలమూరులో వంటా--వార్పు కార్యక్రమం.




**ఆలమూరు అక్టోబర్ 7(ప్రజాజ్యోతి):**గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్ఏ) న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆలమూరు మండల వీఆర్ఏల సంఘం ఆధ్వర్యంలో బుధవారం 22వ రోజు వంటా--వార్పు కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉన్న ధర్నా చౌక్‌లో ఈ కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా ఆలమూరు మండల వీఆర్ఏల సంఘం అధ్యక్షుడు తాతపూడి ఇషాక్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పే స్కేల్‌ను వీఆర్ఏలకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అర్హత కలిగిన వీఆర్ఏలకు పదోన్నతులు కల్పించాలని, విధి నిర్వహణలో మరణించిన వీఆర్ఏల కుటుంబాల్లో ఒకరికి కారుణ్య నియామకం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.వీఆర్ఏల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి, తక్షణమే పరిష్కరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఆలమూరు మండల వీఆర్ఏల సంఘం కార్యదర్శి కంతేటి శివరామారావు, ఉపాధ్యక్షుడు భువనగిరి ఏసు, సలహాదారుడు గూనపల్లి నాగేశ్వరరావు, ట్రెజరర్ కుందేటి శ్రీను, సభ్యులు యార్లగడ్డ జీవరత్నం, ఏడిద వెంకటాద్రి, బూరిగ మంగాలక్ష్మి, చోడవరపు రామలక్ష్మి, కోట లక్ష్మి, షేక్ బషీర్ బీబీ తదితర మండల వీఆర్ఏలు పాల్గొన్నారు.

## శ్రీ అంజనేయస్వామి ఆకు పూజా కార్యక్రమంలో పాల్గొన్న బీసీ ఇందిరారెడ్డి



**బనగానపల్లె :అక్టోబర్ =07 ప్రజాజ్యోతి** బనగానపల్లె పట్టణం కొండపేటలో వెలసిన ప్రముఖ శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో బనగానపల్లె మార్కెట్ యార్డు డైరెక్టర్, కొండపేట టీడీపీ నాయకులు శ్రీ ఎర్రబోలు పవన్ కుమార్ రెడ్డి గారి ఆధ్వర్యంలో స్వామివారికి నిర్వహించిన ఆకు పూజ కార్యక్రమంలో శ్రీమతి బీసీ ఇందిరా రెడ్డి పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.

## రాజరాజేశ్వరి అమ్మ వారి ఉత్సవాల్లో పాల్గొనాలని కాటసాని రామిరెడ్డికి ఆహ్వానం



**బనగానపల్లె:అక్టోబర్=07 ప్రజాజ్యోతి** దసరా నవరాత్రి పర్వదినాలను పురస్కరించుకొని ఓం సాయి గణేష్ యువత, భరత్ నగర్ కాలనీ వారి ఆధ్వర్యంలో నిర్వహించనున్న శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలకు ముఖ్య అతిథిగా విచ్చేసి అమ్మవారి ఆశీస్సులు పొందవలసిందిగా బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి గారిని ఆహ్వానించడం జరిగింది.

## తృటిలో తప్పిన పెను ప్రమాదం



**బనగానపల్లె:అక్టోబర్=07 ప్రజాజ్యోతి** బనగానపల్లె నుండి యాగంటి మీదుగా మద్దిలేటి స్వామి కి వెళ్లే బస్సు తిరిగి వస్తుండగా యాగంటి సమీపంలో బోల్టాలు కట్ అయి కల్వర్టును ఢీకొన్న బనగానపల్లె ఆర్టిసి బస్సు 11మంది ప్రయాణికులు డ్రైవర్ సురక్షితం కండక్టర్కు స్వల్ప గాయాలు కండిషన్‌లేని బస్సులే కారణం. ప్రయాణిక అరోపిస్తుంన్నారు

# సంజామల మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి

### రైతు సంఘం మండల కన్వీనర్ అబ్రహం



**బనగానపల్లె:అక్టోబర్=07 ప్రజాజ్యోతి** ఎల్ నీనో ప్రభావం వల్ల సంజామల మండలంలో పంటలన్నీ పూర్తిగా ఎండిపోయిన వ్యవసాయ అధికారులు తప్పుడు లెక్కలతో చూపించి నంద్యాల జిల్లాలోని 28 మండలాలు కరువు మండలాలుగా ప్రకటించడం జరిగింది సంజామల మండలాన్ని మరిచిన అధికారులు ఇప్పటికైనా మండలంలో రైతులు వేసిన పంట పొలాలను ఏమాత్రం పండుతో ఉన్నాయో చూసి నిర్ధారణ చేసి రైతులకు నష్టపరిహారం అందే విధంగా చర్యలు తీసుకోవాలని పంటలు ఎండిన పొలాలకు ఎకరాకు 50,000 రూపాయలు ఇచ్చి రబీ సీజన్ కు విత్తనాలు ఎరువులు ఇన్పుట్ సబ్సిడీ కింద ఇవ్వాలని రైతులు పంటల కొరకు బ్యాంకులు తీసుకున్న రెండు లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేయాలి కొత్త రుణాలు ఎటువంటి షరతులు లేకుండా రైతులకు కౌలు రైతులకు బ్యాంకుల ద్వారా సహకార రుణాలు అందించి రైతులను ఆదుకోవాలని అన్నారు ఇప్పటికైనా సంజామల మండల వ్యవసాయ అధికారులు ప్రభుత్వానికి కరువు మండలంగా ప్రకటించే విధంగా చర్యలు చేపట్టి రైతాంగని ఆదుకోవాలని డిమాండ్ చేశారు లేనిపక్షంలో రైతులతో కలిసి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాలు చేపడతామని అన్నారు ఈ కార్యక్రమంలో భాస్కర్ రమేష్ సూరి ఎం.మహేష్ చంటి లాజరస్ తదితరులు పాల్గొన్నారు

## ప్రపంచ మేధావి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం బుధవారం నాడు సంజామల పట్టణంలో మాల సంఘాల జేపీసీ రాష్ట్ర కార్యదర్శి దస్తగిరి ఆవిష్కరించారు.



**బనగానపల్లె:అక్టోబర్=07 ప్రజాజ్యోతి** ఈ సందర్భంగా దస్తగిరి మాట్లాడుతూ దేశంలో అంటరానితనం కుల నిర్మూలకై ఎంతో గాను కృషి చేశాడని అంబేద్కర్ గొప్ప సంఘ సంస్కరణ కర్త అని న్యాయనిప్పుడు ఆర్థికవేత అని అన్నారు భారతదేశంలో మొట్టమొదటి న్యాయ శాఖ మంత్రిగా భారత రాజ్యాంగ ముసాయిదా కమిటీ చైర్మన్గా ఆయన పని చేశాడని ఆయన సేవలను కొనియాడారు ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాయలసీమ అధ్యక్షులు బి మద్దిలేటి మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్ జానీ రాష్ట్ర కార్యదర్శి మారం నాగరాజు సంజామల మాల మహానాడు మండల నాయకులు సలాది జయరాముడు మాల మహానాడు మహిళా ఉపాధ్యక్షురాలు వెంకటలక్ష్మి జిల్లా కార్యదర్శి అంబాపురం వెంకటేశ్వర్లు బనగానపల్లె నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు శ్రీరాములు శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు

## చింతూరు మహాధర్నాను జయప్రదం చేసిన కూనవరం ప్రజలకు సీపీఎం అభినందనలు

### పోలవరం నిర్వాసితులు, పోడు భూముల హక్కుల కోసం పోరాటం కొనసాగిస్తాం: బాబు బొర్రయ్య



**కూనవరం, అక్టోబర్ 7: ప్రజా జ్యోతి** చింతూరు ఐటీడీఏ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట అక్టోబర్ 5న పోలవరం నిర్వాసితుల సమస్యలు, పోడు భూముల హక్కుల కోసం నిర్వహించిన మహాధర్నాను జయప్రదం చేసిన కూనవరం మండల ప్రజలకు సీపీఎం పార్టీ తరఫున హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నామని ఆ పార్టీ కూనవరం మండల కార్యదర్శి బాబు బొర్రయ్య అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్వాసితుల సమస్యలు, పోడు భూముల హక్కుల సాధన కోసం సీపీఎం ఆధ్వర్యంలో అక్టోబర్ 1 నుంచి 5 వరకు నిర్వహించిన మోటార్‌సైకిల్ యాత్రలో కూనవరం మండలంలోని వివిధ గ్రామాలను సందర్శించి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నామని తెలిపారు. పునరావాసం, పరిహారం, భూముల సమస్యలు, పోడు భూముల హక్కులు తదితర అంశాలను ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చారని చెప్పారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు నిర్వహించిన మహాధర్నాకు కూనవరం మండలం నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి విజయవంతం చేశారని పేర్కొన్నారు. మహాధర్నా సందర్భంగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిన చింతూరు ఐటీడీఏ పీఓ నరేంద్ర పడాల్కు సీపీఎం తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వివిధ మండలాల ప్రజలతో విడివిడిగా సమావేశమై వారి సమస్యలను తెలుసుకునేందుకు పీఓ సానుకూలంగా స్పందించడం అభినందనీయమన్నారు. మహాధర్నాకు సహకరించిన ప్రజా సంఘాల ప్రతినిధులు, శ్రేయోభిలాషులు, వివిధ గ్రామాల ప్రజలు, పత్రికా మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.పోలవరం నిర్వాసితులు, పోడు భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించే వరకు ప్రజలతో కలిసి సీపీఎం పోరాటం కొనసాగిస్తుందని బాబు బొర్రయ్య స్పష్టం చేశారు.

## కాంట్రాక్ట్ మెడికల్ ఉద్యోగులను క్రమభద్దికరించాలి.

అప్పటివరకు 100% గ్రాస్ శాలరీ చెల్లించాలి

-- కాంట్రాక్ట్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి

-సిఐటియు



**చింతూరు,అక్టోబర్ -7:ప్రజాజ్యోతి ప్రతినిధి రాజు పూసం** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖలో సంవత్సరాల తరబడి కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, అప్పటివరకు 100% గ్రాస్ శాలరీ చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు తమ న్యాయమైన హక్కుల కోసం చేస్తున్న పోరాటానికి జ×ుఖ పోలవరం జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని పోలవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ ప్రకటించారు.బుధవారం నాడు చింతూరు ఐటిడిఏ ముందు వైద్య ఆరోగ్యశాఖ కాంట్రాక్టు ఉద్యోగులు ఆందోళన చేస్తున్న దీక్ష శిబిరాన్ని సిఐటియు పోలవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ మరియు సిఐటియు బృందం సందర్శించారు. అనంతరం వెంకట్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు తదితర ఆరోగ్య సంస్థల్లో ప్రజలకు నిరంతరం వైద్య సేవలు అందిస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు అత్యంత కీలకమైన బాధ్యతలు నిర్వహిస్తున్నాం న్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేదాంట్లో కృషి చేస్తున్నారని అన్నారు.కరోనా మహమ్మారి వంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవలందించారు. అయినప్పటికీ సంవత్సరాలుగా వారికి ఉద్యోగ భద్రత, సమాన వేతనం, సామాజిక భద్రత కల్పించకపోవడం అన్యాయం అని అన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగకపోవడం వారి శ్రమను ప్రభుత్వం దోచుకోవడమేనని అన్నారు.100% గ్రాస్ శాలరీ ఇవ్వాలని,రెగ్యులర్ ఉద్యోగులకు వర్తించే వేతనంలో బేసిక్ పే, డీఏ, హెచ్ఆర్ఏ తదితర అలవెన్సులు ఇవ్వాలని కాంట్రాక్టు ఉద్యోగుల కోరడం న్యాయమైన డిమాండ్ అని అన్నారు. ఎన్నికలకు ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయమని అడుగుతున్నారని గుర్తు చేశారు. సమ్మె చేస్తున్న ఉద్యో గులపై కక్ష సాధింపు చర్యలకు, బెదిరింపులకు పాల్పడకుండా జేఏసీ సంఘాలతో ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి, సమ్మెకు దారితీసిన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వైద్య ఆరోగ్య కాంట్రాక్టు ఉద్యోగులు చేస్తున్న పోరాటం విజయవంతం కావాలని, ఉద్యోగస్తులు అందరూ ఐక్యంగా పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. పోరాటం విజయవంతం అయ్యేవరకు సిఐటియు పూర్తి సంఘీభావంగా ఉంటుందని తెలిపారు.

## వై యస్ ఆర్ సీపీ అవుకు మండల స్థాయి ఐడి కార్డ్స్ పంపిణీ చేసిన చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి







**నంద్యాల:అక్టోబర్=07 ప్రజాజ్యోతి** నంద్యాల జిల్లా అవుకు మండల కేంద్రంలోని చల్లా ప్రజా భవన్నందు మండలస్థాయి సమావేశం నిర్వహించి పలు గ్రామాల వై యస్ ఆర్ సీపీ కార్యకర్తలకు గుర్తింపు కార్డులు అందజేసిన వై యస్ ఆర్ సీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిలింగ్ మెంబర్ మరియు కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులు చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రివర్యులు వైయస్ జగన్మోహన్ రెడ్డి గారి ఆదేశాల మేరకు రాష్ట్రంలోని వైయస్ఆర్ సీపీ కార్యకర్తలందరికీ గుర్తింపు కార్డులు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. అందులో భాగంగానే ఈ రోజు అవుకు మండల కమిటీకి సంబందించిన గుర్తింపు కార్డులు పంపిణీ జరుగుతుందన్నారు. ఈ కార్డు యొక్క విశిష్టత గురించి వివరిస్తూ రాబోవు కాలంలో పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని అలాగే పార్టీ అధికారంలోకి వచ్చాక కార్యకర్తలకు పార్టీలో పెద్దపీట వేస్తారని, కార్యకర్తలకు కేటాయించిన పదవే కాకుండా వారివారి పనితీరును బట్టి పదోన్నతులు ఉంటాయని మరియు గుర్తింపు కార్డు కలిగిన ప్రతి కార్యకర్తకు 5 లక్షల జీవిత బీమా ఉంటుందని తెలిపారు. అలాగే వైయస్ఆర్ సీపీ పార్టీలో ఈ స్థాయిలో వున్న వ్యక్తులైన పార్టీ అధికారంలోకి రావడం కోసం అహర్నిశలు పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైయస్ఆర్ సీపీ కార్యకర్తలు, అభిమానులు, మండల ప్రజలు పాల్గొన్నారు.

# సమస్యల సుడిగుండంలో 'జగనన్న కాలనీ'.. అధికారులు స్పందించకుంటే కలెక్టరేట్ బాట!

**పోరుమామిళ్ల అక్టోబర్ 07(ప్రజా ప్రతినిధి)** ప్రభుత్వం పేదల ఇళ్ల కోసం కేటాయించిన జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. పోరుమామిళ్ల కాల్వకట్ట ప్రాంతంలోని జగనన్న కాలనీని ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ ప్రతినిధులు బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అక్కడ నివాసముంటున్న బాధితుల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు.

**70 ఇళ్లు మంజూరు.. వసతులు లేక 12 కుటుంబాలే!**

కాలనీలో ప్రభుత్వం సుమారు 70 నుంచి 80 ఇళ్లను మంజూరు చేసింది. అయితే తాగునీరు, వీధి దీపాల వంటి కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఇప్పటివరకు కేవలం 12 కుటుంబాలు మాత్రమే అక్కడ నివాసముంటున్నాయని స్థానికులు వాపోయారు. లబ్ధిదారులు ఇల్లు కట్టుకున్నా.. సౌకర్యాలు లేకపోవడంతో వచ్చి ఉండలేకపోతున్నారని తెలిపారు.

**నీటి వాల్ తిప్పేస్తున్నారు.. చీకట్లో పాములు, తేళ్ల భయం!**

తాగునీటి ఇబ్బందులు: కాలనీకి సరఫరా అయ్యే మంచి నీటిని పక్కనే ఉన్న రాజీవ్ నగర్‌కు చెందిన కొందరు వాల్ తిప్పుకోవడం వల్ల తమకు నీరు అందడం లేదని బాధితులు ఆరోపించారు. ఈ సమస్యపై పంచాయతీ సెక్రటరీకి పలుమార్లు విన్నవించినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. చీకటి సామ్రాజ్యం: వీధి దీపాలు లేకపోవడంతో రాత్రివేళల్లో కాలనీ మొత్తం చీకటమయంగా మారుతోంది. దీంతో తేళ్లు, పాములు, ఇతర విషకీటకాల సంచారంతో తీవ్ర భయాందోళనల నడుమ కాలం వెళ్లదీస్తున్నామని స్థానికులు తెలిపారు. బాధితులకు అండగా ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ వెంటనే కాలనీకి నిరంతర తాగునీటి సరఫరా అందించాలని, వీధి దీపాలు అమర్చి మిగిలిన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ రాష్ట్ర సెక్రటరీ ఫణి రావు, ఆఫీస్ సెక్రటరీ కె. ప్రవీణ్ బాబు, ఆర్గనైజర్ సెక్రటరీ శ్రీను డిమాండ్ చేశారు. అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోకపోతే బాధితుల తరఫున జిల్లా కలెక్టరేట్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.




# ప్లాంట్‌కు తాళం..... పిల్లలకు దాహం...!

## ఆర్వో ప్లాంట్ ఉన్నా.. తాగునీటికి నోచుకోని గజ్జహళ్లి పాఠశాల విద్యార్థులు

## గజ్జహళ్లి ఎంపీపీ పాఠశాలలో తాగునీటి ఎద్దడి..అలంకారప్రాయంగా ఆర్ ఓ ప్లాంట్








**హొళగుంద,అక్టోబర్ 6, ప్రజా జ్యోతి న్యూస్ –** మండల పరిధిలోని గజ్జహళ్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో తాగునీటి సమస్య తీవ్రంగా మారింది. పాఠశాలలో తాగేందుకు నీరు అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు ప్రతిరోజూ ఇళ్ల నుంచే నీటి బాటిళ్లు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.విద్యార్థుల తాగునీటి అవసరాలను తీర్చేందుకు లక్షల రూపాయల వ్యయంతో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేసినప్పటికీ.. అది విద్యార్థులకు ఉపయోగపడకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ప్లాంట్ పనిచేయకపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తే 'టెక్నీషియన్ రావాలి', 'త్రీ–ఫేస్ కరెంట్ లేదు' అంటూ సమాధానాలు వస్తున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఆర్వో ప్లాంట్ అందుబాటులోకి వచ్చే వరకు కనీసం ప్రత్యామ్నాయంగా సాధారణ కొళాయిలు ఏర్పాటు చేసి పంచాయతీ నీటిని అయినా విద్యార్థులకు అందించాల్సిన అవసరం ఉంది. అయితే ఇన్ని రోజులుగా పాఠశాలలో తాగునీటి పరిస్థితిని పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. చిన్నారుల ఆరోగ్యానికి సంబంధించిన తాగునీటి సమస్యను కూడా పట్టించుకోకపోవడం పట్ల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలో కనీస మౌలిక వసతుల్లో ఒకటైన తాగునీరు అందకపోవడం విద్యార్థులకు తీవ్ర ఇబ్బందిగా మారింది.తక్షణమే నీటి సౌకర్యం కల్పించాలి ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గజ్జహళ్లి ఎంపీపీ పాఠశాలను పరిశీలించి, ఆర్వో ప్లాంట్‌ను వెంటనే పనిచేసేలా చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రత్యామ్నాయంగా కొళాయిలు ఏర్పాటు చేసి నిరంతర తాగునీటి సరఫరా కల్పించాలని గ్రామస్తులు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. సమస్య పరిష్కారం కాకపోతే గ్రామస్తులు, తల్లిదండ్రులతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరిస్తున్నారు.

# దేవరగట్టు బన్ని ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

**శాంతియుతంగా ఉత్సవాల నిర్వహణే లక్ష్యం..**

**అధికారులు,ఉత్సవ నిర్వహణ కమిటీ సభ్యులతో కలెక్టర్, ఎస్పీ సమన్వయ సమావేశం**





**హొళగుంద, అక్టోబర్ 7, ప్రజా జ్యోతి న్యూస్ –** దేవరగట్టు బన్ని ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా కర్నూలు కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆధ్వర్యంలో సంబంధిత శాఖల జిల్లా అధికారులు, హొళగుంద, హాలహర్వి, ఆలూరు మండలాల అధికారులు, దేవరగట్టు పరిసర గ్రామాల పెద్దలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. బన్ని ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన మౌలిక వసతులు, తాగునీరు, వైద్య సేవలు, విద్యుత్, పారిశుధ్యం, రవాణా తదితర ఏర్పాట్లపై అధికారులు చర్చించారు. ముఖ్యంగా ఉత్సవాలు జరిగే ప్రాంతంలో భద్రతా చర్యలు, పోలీస్ బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, అత్యవసర సేవలను సమర్థవంతంగా నిర్వహించేలా శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఉత్సవాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించడంతో పాటు ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్, ఎస్పీ స్పష్టం చేశారు. స్థానిక అధికారులు, గ్రామ పెద్దలు, ప్రజలు జిల్లా యంత్రాంగానికి సహకరించి బన్ని ఉత్సవాలను ప్రశాంతంగా, సురక్షితంగా విజయవంతం చేయాలని కోరారు.బన్ని ఉత్సవాల నేపథ్యంలో ముందస్తు ప్రణాళికతో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసేలా జిల్లా యంత్రాంగం చర్యలు చేపడుతోంది.ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు,దేవరగట్టు పరిసర గ్రామాల పెద్దలు, దేవరగట్టు ఆలయాన్ని నిర్వహణ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# స్కానింగ్ కేంద్రాల్లో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

**ఆర్డీవో శ్రీనివాస్, డిపీఎంవో శ్రీనివాసులు రెడ్డి**




**గుంతకల్లు అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి):** స్కానింగ్ కేంద్రాల్లో నిబంధనలను తప్పనిసరిగా పాటించేలా చూడాలని ఆర్డీవో శ్రీనివాస్, డిపీఎంవో శ్రీనివాసులు రెడ్డి సూచించా రు. బుధవారం ఆర్డీవో కార్యాలయంలో గర్భస్థ పిండ లింగనిర్ధారణ నివారణ చట్టం (పిసిపిఎన్ డిటి యాక్ట్) పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్కానింగ్ కేంద్రాల్లో నిర్వహించే పరీక్ష లు, రికార్డుల నిర్వహణ, రిజిస్ట్రేషన్లు, ఫారం–ఎఫ్ తదితర అంశాలను నిబంధ నల మేరకు నిర్వహించాల ని సూచించారు. గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ చేయడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. లింగ నిర్ధారణకు సంబంధించిన ఎలాంటి అక్రమ కార్యకలా పాలు జరగకుండా సంబం ధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అమ్మాయిల సంఖ్య తగ్గిపోవడం వల్ల భవిష్యత్ తరాల్లో జనాభా సమతుల్య త దెబ్బతినడంతో పాటు, కుటుంబ వ్యవస్థ, మానవీ య విలువలు, సామాజిక సంబంధాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ లు బలహీనపడటం, ఒంటరితనం పెరగడం, వృద్ధాప్యంలో రక్షణ కొరవడటం వంటి సామాజిక సమస్యలు ఉత్పన్నమయ్యే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల లింగ సమానత్వాన్ని కేవలం నినాదాలకే పరిమితం చేయకుండా, ఆడపిల్లల ప్రాణాలను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని సూచించారు. భ్రూణ లింగ నిర్ధారణను అరికట్టి, ఆడ పిల్లల సంఖ్యను కాపాడు కోవడం నేటి తక్షణ కర్తవ్యమని తెలిపారు. అమ్మాయిలు లేని సమాజం భవిష్యత్తులో తీవ్ర సామాజిక అసమతుల్యతకు దారితీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిసిపిఎన్ డిటి కమిటీ సభ్యులు డాక్టర్ సుజాత, గైనకాలజిస్ట్, డాక్టర్ రామాంజనేయులు, పీడియాట్రిషన్, డాక్టర్ పవన్ కుమార్, రేడియాల జిస్ట్, మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ గంగాధర్, డాక్టర్ హరిత, డాక్టర్ రాఘవేంద్ర, ప్రగతి మహిళా సంఘం నుంచి రాధ, నజమునిస, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, మున్సిపాలిటీ టౌన్ ప్రాజెక్ట్ ఆఫీసర్ మోహన్, గుంతకల్ డివిజన్ పరిధిలోని స్కానింగ్ కేంద్రాల యాజమాన్య ప్రతినిధులు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం నుంచి వేణుగోపాల్, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్, రియాజ్, ఎంఓ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారంతో బహు ప్రయోజనాలు.



**బనగానపల్లె:అక్టోబర్=07 ప్రజాజ్యోతి** అంగన్వాడి కేంద్రంలో బాలింతలు, గర్భిణీ స్త్రీలకు లభించే పౌష్టికాహారంతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని అంగన్వాడి సూపర్వైజర్ జి శాంతా అన్నారు.సంజామల మండల పరిధిలోని గిద్దలూరు లోని ఒకటవ అంగన్వాడి కేంద్రంలో పోషణ మాసొస్తవాల కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ జి శాంతా మాట్లాడుతూ పోషణ మాసోస్తవాల కార్యక్రమం సెప్టెంబర్ నెల 9వ తేదీ నుండి అక్టోబర్ నెల 8వ తేదీ వరకు నిర్వహించకుంటామని ఆ న్నారు. పోషణ మాసొస్తవాల ముఖ్య ఉద్దేశం గర్భిణీ స్త్రీలు బాలింతలు సమతుల్య ఆహారం తీసుకోవాలని అలాగే ఆకుకూరలు,తాజా కూరగాయలు,గుడ్లు , పాలు,చిరుధాన్యాలు వాడాలని అంగన్వాడి కేంద్రంలో సంపూర్ణ ఆరోగ్యం కొరకు బాలామృతం,చిక్కీలు, ఖర్జూరాలు, రాగి పిండి, అటుకులు, రాగిజావ తప్పకుండా తీసుకోవాలని తెలియజేశారు. సమాజ ఆరోగ్యానికి పునాది తల్లి ఆరోగ్యమేనని, పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యవంతమైన తరాలు నిర్మితమవుతాయని తెలిపారు ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ, ఏఎన్ ఎం,ఆశా వర్కర్లు, అంగన్వాడీ వర్కర్,హెల్పర్ మరియు తల్లులు పాల్గొన్నారు.

## పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణపై తల్లులకు అవగాహన

**బాల్యవివాహాల నివారణపై చైతన్యం కల్పించాలి: వి. వనజాక్షి**



**కూనవరం: అక్టోబర్ 7. ప్రజా జ్యోతి** కూనవరం మండలం కాచవరం సెక్టార్ పరిధిలోని అయ్యవారిగూడెం అంగన్వాడీ కేంద్రంలో 9వ జాతీయ పోషణ మాసం--2026 ముగింపు కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పోలవరం జిల్లా ఐసీడీఎస్ కూనవరం ప్రాజెక్టు సీడీపీఓ శ్రీమతి వి. మల్లిక ఆధ్వర్యంలో సూపర్వైజర్ వి. వనజాక్షి కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వి. వనజాక్షి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందుతున్న సేవలు, పౌష్టికాహారం, ఆరోగ్య పరిరక్షణపై తల్లులు, గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన పెంచి, వాటి నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని సూచించారు.పోషకాహారం, ఆరోగ్యం, పరిశుభ్రత, చిన్నారుల సంరక్షణ తదితర అంశాలపై అంగన్వాడీ కేంద్రాల ద్వారా నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు, అంగన్వాడీ కార్యకర్తలు, తల్లులు తదితరులు పాల్గొన్నారు

## పెనికేరు గ్రామంలో 18 మంది గర్భిణులకు సామూహిక సీమంతాలు,ఆడపడుచులకు సారె పెట్టి ఆత్మీయంగా ఆశీర్వదించిన ఈదర చిన్నబాబు.



**ఆలమూరు, అక్టోబర్ 7(ప్రజాజ్యోతి):**పండంటి బిడ్డలకు జన్మనివ్వబోతున్న గర్భిణులను సొంత కుటుంబ సభ్యులుగా భావించి వారికి ఆత్మీయతను పంచేందుకు ఆలమూరు మండలం పెనికేరు గ్రామంలో ఈదర చినబాబు సామూహిక సీమంత కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినోత్సవ మహోత్సవాలు, సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా కొత్తపేట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ ఏ. గజలక్ష్మి సూచనల మేరకు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగ సత్యవేణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. టీడీపీ సీనియర్ నాయకులు, వెంకటేశ్వర సంస్థల అధినేత ఈదర చిన్నబాబు సమక్షంలో అంగన్వాడీల అభినందన ఉత్సవం, గర్భిణుల సీమంతోత్సవం నిర్వహించారు.పెనికేరు గ్రామంలోని ఐదు అంగన్వాడీ కేంద్రాలకు చెందిన 18 మంది గర్భిణులకు సామూహికంగా సీమంతాలు నిర్వహించారు. గర్భిణులను ఆడపడుచులుగా భావించిన ఈదర చిన్నబాబు వారికి చీరలు, గాజులు, పసుపు, కుంకుమ, పూలతో సారె పెట్టి ఆత్మీయంగా ఆశీర్వదించారు. దీంతో గర్భిణుల కుటుంబాల్లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. ఈ సందర్భంగా ఈదర చిన్నబాబు మాట్లాడుతూ గర్భిణులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. తల్లి ఆరోగ్యమే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యానికి పునాది అని పేర్కొంటూ, గర్భధారణ సమయంలో పౌష్టికాహారం తీసుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. మాతా శిశు సంరక్షణకు సంబంధించి తల్లులకు పలు సూచనలు చేశారు.గర్భధారణ దశ నుంచి ప్రసవం వరకు ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలు, టీకాలు, ఇతర సదుపాయాలను ప్రతి గర్భిణీ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు.ప్రసవం అనంతరం పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని, అనంతరం ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యాభ్యాసం చేయించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని ఆయన పిలుపునిచ్చారు. ఆడపడుచులు తమను సొంత సోదరుడిగా భావించి ఎలాంటి అవసరం వచ్చినా తనను సంప్రదించాలని, వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఈదర చినబాబు వారికి భరోసా ఇచ్చారు.అనంతరం అంగన్వాడీ కార్యకర్తల సేవలను గుర్తిస్తూ అభినందన కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతల సంక్షేమం కోసం అంగన్వాడీ సిబ్బంది అందిస్తున్న సేవలను పలువురు కొనియాడారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంగన్వాడీ ఉత్సవం

--- చిన్నారుల ఆరోగ్యం,పోషణపై అవగాహన



**నందవరం అక్టోబర్ 07(ప్రజా జ్యోతి ):** హాలహర్వి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం లో ఎమ్మిగనూరు ఐసీడీఎస్ సీడీపీఓ సఫర్నిసా బేగం, సూపర్వైజర్ గుణశేఖరమ్మ ఆదేశాల మేరకు అంగన్వాడీ ఉత్సవ కార్యక్రమాన్ని అంగన్వాడీ కార్యకర్తలు లక్ష్మీదేవి,జయంతి,లలిత లు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల సమగ్ర అభివృద్ధికి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను వివరించారు. చిన్నారులకు పౌష్టికాహారం అందించడం,పరిశుభ్రత పాటించడం,ఆరోగ్య సంరక్షణతో పాటు ప్రాథమిక విద్యపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. చిన్నారుల శారీరక, మానసిక వికాసానికి సమతుల్య ఆహారం ఎంతో అవసరమని అంగన్‌వాడీ సిబ్బంది వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు పోషకాహారం,ఆరోగ్య సేవలు, ప్రీ-స్కూల్ విద్య వంటి సేవలను నిరంతరం అందిస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకుని చిన్నారుల ఆరోగ్యం,విద్యాభివృద్ధికి సహకరించాలని సూచించారు. అనంతరం వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సహాయకులు,తల్లిదండ్రులుచిన్నారులు, తదితరులు పాల్గొన్నారు.

## మూడు మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలి- సిపిఐ.



**ఎమ్మిగనూరు, అక్టోబర్ 7(ప్రజా జ్యోతి):** గోనెగండ్ల, ఎమ్మిగనూరు, నందవరం మండలాలను తక్షణమే కరువు మండలాలుగా ప్రకటించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జి.రంగన్న డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షాభావంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, కర్నూలు జిల్లాలో ప్రకటించిన కరువు మండలాల జాబితాలో ఈ మూడు మండలాలను విస్మరించడం అన్యాయమన్నారు. పంట నష్టపోయిన రైతులకు పరిహారం, రుణాలపై ఉపశమనం, విత్తనాలు, ఎరువుల సరఫరా, సాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. మూడు మండలాలను కరువు మండలాలుగా ప్రకటించకపోతే సిపిఐ -- ఏఐ కేస్ -- బి కే యం యు ఆధ్వర్యంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో భాస్కర్ యాదవ్, సోమేశ్వర్‌రెడ్డి, మద్దిలేటి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఉత్తమ వార్డెన్ వెంకటరెడ్డికి ఘన సన్మానం



**ప్రజా జ్యోతి న్యూస్** మైలవరం మండలం దొమ్మరనంద్యాల ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహ వార్డెన్ వెంకటరెడ్డికి రాష్ట్ర ఉత్తమ వార్డెన్‌గా అవార్డు లభించిన సందర్భంగా బుధవారం వసతి గృహంలో ఘనంగా సన్మానించారు. డీవైఎఫ్ఐ, గండికోట చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సన్మాన సభ నిర్వహించి వార్డెన్ వెంకటరెడ్డిని శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. అక్టోబర్ 2న గాంధీ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా వెంకటరెడ్డి రాష్ట్ర ఉత్తమ వార్డెన్ అవార్డును అందుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయన సేవలను గుర్తిస్తూ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్, గండికోట చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వై.చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ దొమ్మరనంద్యాల బీసీ బాలుర వసతి గృహానికి రాష్ట్ర ఉత్తమ వార్డెన్ అవార్డు రావడం సంతోషించదగ్గ విషయమన్నారు. వెంకటరెడ్డికి లభించిన ఈ అవార్డు దొమ్మరనంద్యాల గ్రామానికే కాకుండా మైలవరం మండలానికి, జమ్మలమడుగు నియోజకవర్గానికి, వైఎస్సార్ కడప జిల్లాకు రాష్ట్రస్థాయిలో మంచి గుర్తింపు తీసుకువచ్చిందన్నారు. విద్యార్థుల సంక్షేమం, వసతి గృహ అభివృద్ధికి వెంకటరెడ్డి చేస్తున్న సేవలు అభినందనీయమని, భవిష్యత్తులో ఆయనకు మరిన్ని అవార్డులు రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ, గండికోట చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు, వసతి గృహ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఇమామి ఆగ్రోటెక్ లిమిటెడ్ కు స్వచ్ఛ ఆంధ్ర అవార్డు.

**జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల చేతుల మీదుగా యూనిట్ హెడ్ ఎం. వి నారాయణమూర్తి స్వీకరణ.**

**ముత్తుకూరు, అక్టోబర్ 7( ప్రజా జ్యోతి)** ఆయిల్ ఉత్పత్తి కర్మాగారం ఇమామి ఆగ్రోటెక్ లిమిటెడ్ కు రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్ర-2026 అవార్డును అందజేసింది. స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాలను చక్కగా చేసి పారిశుధ్యం మెరుగుపరుస్తూ పర్యావరణ పరిరక్షణకు చేసిన కృషిని అభినందిస్తూ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అవార్డును జిల్లా స్థాయిలో అందజేశారు. ఆయిల్ ఉత్పత్తి కర్మాగారం యూనిట్ హెడ్ ఎం. వి నారాయణమూర్తి ఈ అవార్డును కలెక్టర్ నుండి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశంసించినారు. మరి కొన్ని అవార్డులు సాధిస్తామని యూనిట్ హెడ్ తెలియజేశారు




# వర్మీ కంపోస్ట్ తయారీపై మండల స్థాయి ఎక్స్‌పోజర్ విజిట్ మరియు ఒకరోజు శిక్షణా కార్యక్రమం




**చెన్నూరు, అక్టోబర్ 07, 2026:** వై.ఎస్. ఆర్. జిల్లా, చెన్నూరు మండలంలోని చెన్నూరు షెడ్ వద్ద వర్మీ కంపోస్ట్ తయారీ పై మండల స్థాయి ఎక్స్‌పోజర్ విజిట్ మరియు ఒకరోజు శిక్షణా కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమం ఇుూరా శ్రీ విజయ్ భాస్కర్ గారి మార్గదర్శకత్వంలో, చెన్నూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీ బి. కిరణ్ మోహన్ రావు గారి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. కార్యక్రమం లో ఉప మండల అభివృద్ధి అధికారి శ్రీ కే. రామచంద్రారెడ్డి గారు, చెన్నూరు మండలంలోని 10 గ్రామపంచాయతీల పంచాయతీ కార్యదర్శులు (గ్రాణాలు), గ్రీన్ అంబాసిడర్లు/క్లాప్ మిత్రాలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ాబ్రూజ షెడ్ వద్ద తడి చెత్తను సక్రమంగా సేకరించడం, సేంద్రీయ వ్యర్థాలను వినియోగించడం, వర్మీ కంపోస్ట్ తయారీకి అనువైన పదార్థాల ఎంపిక, బెడ్‌ల తయారీ, వర్మీ కల్చర్ వినియోగం, తేమను నిర్వహించడం, వర్మీ కంపోస్ట్‌ను సిద్ధం చేసి సేకరించే విధానం తదితర అంశాలపై ప్రాక్టికల్‌గా అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఉత్పత్తి అయ్యే తడి చెత్తను వృథా చేయకుండా శాస్త్రీయ పద్ధతిలో వినియోగించడం ద్వారా సేంద్రీయ ఎరువును తయారు చేసుకోవడంతో పాటు గ్రామపంచాయతీల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచవచ్చని అధికారులు వివరించారు. ఈ సందర్భంగా పీణా శ్రీ బి. కిరణ్ మోహన్ రావు మాట్లాడుతూ, 2026 అక్టోబర్ 30వ తేదీ నాటికి ప్రతి గ్రామపంచాయతీ కనీసం ఒక టన్ను వర్మీ కంపోస్ట్ తయారు చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే ప్రతి ఇంటి వద్ద బిన్ బ్యాగ్ విధానాన్ని అమలు చేసి, తడి మరియు పొడి చెత్తను ఇంటి వద్దనే వేరు చేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణను మరింత పటిష్టం చేయడంతో పాటు ాబ్రూజలను సమర్థవంతంగా వినియోగించు కోవాలని తెలిపారు. ఉప మండల అభివృద్ధి అధికారి శ్రీ కే. రామచంద్రారెడ్డి మాట్లాడు తూ, ప్రతి గ్రామపంచాయతీలో వర్మీ కంపోస్ట్ తయారీ ప్రక్రియ నిరంతరంగా కొనసాగించేలా గ్రీన్ అంబాసిడర్లు మరియు క్లాప్ మిత్రాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఇంటింటి చెత్త సేకరణతో పాటు తడి చెత్తను వర్మీ కంపోస్ట్ తయారీకి వినియోగించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న గ్రీన్ అంబాసిడర్లు మరియు క్లాప్ మిత్రాలకు వర్మీ కంపోస్ట్ తయారీపై ప్రత్యక్ష శిక్షణ, సాంకేతిక అవగాహన కల్పించారు. శిక్షణకు హాజరైన వారికి భోజనం, స్నాక్స్ మరియు టీ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమం ద్వారా చెన్నూరు మండలంలోని అన్ని గ్రామపంచాయతీలలో తడి చెత్తను వనరుగా మార్చడం, వర్మీ కంపోస్ట్ ఉత్పత్తిని పెంచడం, ఇంటింటా బిన్ బ్యాగ్ విధానాన్ని అమలు చేయడం మరియు గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగు పరచడం లక్ష్యంగా అధికారులు చర్యలు చేపట్టనున్నారు.

--- ఎంపీడీఓ, చెన్నూరు

# స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్స్--2026లో చెన్నూరు మండలానికి రాష్ట్రస్థాయి గౌరవం





**చెన్నూరు ప్రజా జ్యోతి అక్టోబర్7** చెన్నూరు మండలంలోని బయనపల్లి గ్రామపంచాయతీకి రాష్ట్రస్థాయి అవార్డు జొన్నవరం హనుమంతుకు రాష్ట్రస్థాయి స్వచ్ఛత గ్రీన్ అంబాసిడర్ అవార్డు గాంధీ జయంతి సందర్భంగా నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్స్--2026లో వైఎస్ఆర్ జిల్లా చెన్నూరు మండలంలోని బయనపల్లి గ్రామపంచాయతీకి రాష్ట్రస్థాయి స్వచ్ఛ గ్రామపంచాయతీ అవార్డు, అలాగే అదే గ్రామపంచాయతీకి చెందిన శ్రీ జొన్నవరం హనుమంతు గారికి రాష్ట్రస్థాయి స్వచ్ఛత గ్రీన్ అంబాసిడర్ అవార్డు లభించడం చెన్నూరు మండలానికి గర్వకారణమని ఎంపీడీఓ శ్రీ దీ. కిరణ్ మోహన్ రావు తెలిపారు. 02-10-2026న విజయవాడ నిర్వహించిన రాష్ట్రస్థాయి అవార్డుల ప్రదానోత్సవంలో గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి సమక్షంలో అవార్డులు అందుకోవడం జరిగిందని ఎంపీడీఓ తెలిపారు. బయనపల్లి గ్రామపంచాయతీ స్వచ్ఛత కార్యక్రమాల్లో భాగంగా డోర్ టు డోర్ చెత్త సేకరణ, తడి--పొడి చెత్త వేరు చేయడం, పారిశుధ్య నిర్వహణ, వర్మీ కంపోస్ట్ తయారీ, ాబ్రూజ షెడ్ నిర్వహణ, గ్రీన్ అంబాసిడర్ల సేవలు వంటి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. ముఖ్యంగా కేవలం ఆరు నెలల వ్యవధిలో సుమారు 7.5 టన్నుల వర్మీ కంపోస్ట్ ఉత్పత్తి చేయడం, సేకరించిన వ్యర్థాలను సమర్థవంతంగా వినియోగించడం వంటి చర్యలు గ్రామపంచాయతీకి రాష్ట్రస్థాయి గుర్తింపు రావడానికి దోహదపడ్డాయని పేర్కొన్నారు.

**గౌరవ ఎమ్మెల్యే శ్రీ పుత్తా కృష్ణచైతన్య రెడ్డి అభినందనలు**

ఈ సందర్భంగా కమలాపురం నియోజకవర్గ గౌరవ ఎమ్మెల్యే శ్రీ పుత్తా కృష్ణచైతన్య రెడ్డి గారు బయనపల్లి గ్రామపంచాయతీకి రాష్ట్రస్థాయి అవార్డు, శ్రీ జొన్నవరం హనుమంతు గారికి రాష్ట్రస్థాయి స్వచ్ఛత గ్రీన్ అంబాసిడర్ అవార్డు లభించడం పట్ల హర్షం వ్యక్తం చేసి, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రీన్ అంబాసిడర్లు మరియు గ్రామ ప్రజలను అభినందించారని ఎంపీడీఓ తెలిపారు. స్వచ్ఛత కార్యక్రమాలను ఇదే స్ఫూర్తితో మరింత ముందుకు తీసుకెళ్లాలని, గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణను మరింత పటిష్టం చేయాలని ఎమ్మెల్యే సూచించినట్లు ఎంపీడీఓ తెలిపారు.

**డిఎల్పి ప్రశంసలు**

వైఎస్ఆర్ జిల్లా డి డి ఓ శ్రీమతి మైథిలి గారు మరియు డి ఎల్ పి ఓ శ్రీ విజయ్ భాస్కర్ గారు కూడా బయనపల్లి గ్రామపంచాయతీ సాధించిన రాష్ట్రస్థాయి గుర్తింపును అభినందించారని ఎంపీడీఓ తెలిపారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణ, తడి చెత్త వినియోగం, వర్మీ కంపోస్ట్ తయారీ, ఎస్ డబ్ల్యూ పిసి నిర్వహణ వంటి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడం అభినందనీయమని వారు కొనియాడినట్లు తెలిపారు. ఎంపీడీఓ కిరణ్ మోహన్ రావు మాట్లాడుతూ, "బయనపల్లి గ్రామపంచాయతీకి లభించిన రాష్ట్రస్థాయి అవార్డు ఒక్కరి విజయమే కాదు. ఎంపీడీఓ కార్యాలయం, డిప్యూటీ ఎంపీడీఓ/స్పెషల్ ఆఫీసర్, పంచాయతీ అభివృద్ధి అధికారి, పంచాయతీ సిబ్బంది, గ్రీన్ అంబాసిడర్లు మరియు గ్రామ ప్రజల సమిష్టి కృషికి లభించిన గుర్తింపు" అని అన్నారు. అలాగే వైఎస్ఆర్ జిల్లా పిఓ డిపిఓ మరియు జిల్లా కోఆర్డినేటర్, కడప అందించిన ప్రోత్సాహం, మార్గదర్శకత్వం మరియు సహకారం మరువలేనివని ఎంపీడీఓ పేర్కొన్నారు. ఈ అవార్డు ద్వారా చెన్నూరు మండలంలోని అన్ని గ్రామపంచాయతీలకు మరింత ఉత్సాహం లభించిందని, భవిష్యత్తులో స్వచ్ఛత, పారిశుధ్యం, పర్యావరణ పరిరక్షణ, వర్మీ కంపోస్ట్ తయారీ, ఇంటింటా చెత్త సేకరణ, తడి--పొడి చెత్త వేరు చేయడం మరియు షెడ్‌ల సమర్థవంతమైన నిర్వహణలో మరింత మెరుగైన ఫలితాలు సాధించేలా చర్యలు చేపడతామని తెలిపారు. ఈ సందర్భంగా బయనపల్లి గ్రామపంచాయతీ ప్రజలకు, పంచాయతీ సిబ్బందికి, శ్రీ జొన్నవరం హనుమంతు గారికి, గ్రీన్ అంబాసిడర్లకు, క్లాప్ మిత్రులకు మరియు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఎంపీడీఓ కిరణ్ మోహన్ రావు ప్రత్యేక అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు.

# చైర్మన్ రేసులో గుజ్జుల గౌరీశ్వర నాయుడు..!?





**సామాజిక సేవకుడు.. వ్యాపారవేత్త.. వాల్మీకి బోయ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్.. ప్రజా సమస్యలపై నిరంతర స్పందన!**

**ప్రజా జ్యోతి నందికొట్కూరు** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నందికొట్కూరు పట్టణంలో రాజకీయ చర్చలు ఊపందుకుంటున్నాయి. వివిధ వర్గాల్లో మున్సిపాలిటీ చైర్మన్ పదవికి సంబంధించి పలువురి పేర్లు వినిపిస్తున్న నేపథ్యంలో సామాజిక సేవకుడు, వ్యాపారవేత్త, మహర్షి వాల్మీకి బోయ సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుజ్జుల గౌరీశ్వర నాయుడు పేరు కూడా చర్చకు రావడం స్థానికంగా ఆసక్తిని రేకెత్తిస్తోంది. నందికొట్కూరు ప్రాంతంలో సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు ప్రజా సమస్యలపై స్పందిస్తూ తనవంతు కృషి చేస్తున్న వ్యక్తిగా గుజ్జుల గౌరీశ్వర నాయుడికి పరిచయం ఉందని ఆయనతో అనుబంధం ఉన్న వర్గాలు చెబుతున్నాయి. రైతులు, వ్యాపారులు, యువత, మహిళలు, పేదలు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు పట్టణ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి అంశాలపై స్పందిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండే విధానంతో ముందుకు సాగుతున్నారని వారు పేర్కొంటున్నారు. ప్రజా జీవితంలో పదవుల కంటే ప్రజలకు అందుబాటులో ఉండటం, వారి సమస్యలను తెలుసుకోవడం, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, పరిష్కారం కోసం నిరంతరం ప్రయత్నించడం ముఖ్యమనే భావనతో గుజ్జుల గౌరీశ్వర నాయుడు ముందుకు సాగుతున్నట్లు సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. మున్సిపాలిటీ స్థాయిలో అవకాశం లభిస్తే తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ, విద్య, వైద్యం, పచ్చదనం, పట్టణ మౌలిక వసతులు, మహిళలు--యువత సంక్షేమం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలనే ఆలోచనతో ఉన్నట్లు సమాచారం. వ్యాపార రంగంలో తన అనుభవంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా ఉంటున్న గుజ్జుల గౌరీశ్వర నాయుడు, రైతులు, ఎరువులు--విత్తనాలు--పురుగుమందుల వ్యాపారులు, చిన్న వ్యాపారులు, పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని భావిస్తున్నట్లు ఆయనతో పరిచయం ఉన్న వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రజల సమస్యలను కేవలం వినడమే కాకుండా.. అవి పరిష్కారమయ్యే వరకు సంబంధిత శాఖలతో సమన్వయం చేయడం తన ప్రజా సేవా విధానంలో భాగంగా ఉండాలని ఆయన భావిస్తున్నట్లు చెబుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నందికొట్కూరు పట్టణ రాజకీయాల్లో వివిధ వర్గాల కదలికలు ప్రారంభమయ్యాయి. ఎన్నికల ప్రక్రియ, రిజర్వేషన్ తదితర అధికారిక అంశాలపై స్పష్టత వచ్చిన తర్వాతే తుది రాజకీయ సమీకరణాలు మరింత స్పష్టమయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో మున్సిపల్ చైర్మన్ పదవికి సంబంధించి పలువురి పేర్లు చర్చకు వస్తుండగా, గుజ్జుల గౌరీశ్వర నాయుడు పేరు కూడా వినిపించడం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తోంది. గుజ్జుల గౌరీశ్వర నాయుడు మున్సిపల్ చైర్మన్ రేసులో అధికారికంగా అడుగు వేస్తారా..? ఎలాంటి రాజకీయ నిర్ణయం తీసుకుంటారు..? అవకాశం లభిస్తే ఎలాంటి అభివృద్ధి, ప్రజా సేవా ప్రణాళికతో ముందుకు వస్తారు..? అన్నది రానున్న రోజుల్లో స్పష్టత రావాల్సి ఉంది. అయితే ఇప్పటికే సామాజిక సేవా కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై స్పందన ద్వారా ప్రజలతో మమేకమవుతున్న గుజ్జుల గౌరీశ్వర నాయుడు పేరు నందికొట్కూరు మున్సిపల్ రాజకీయ చర్చలో వినిపించడం మాత్రం స్థానికంగా ఆసక్తిని రేకెత్తిస్తోంది.

## పినపల్ల గ్రామంలో ఘనంగా అంగన్వాడీ ఉత్సవం,చిన్నారులు, గర్భిణీల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి.



**ఆలమూరు, అక్టోబర్ 7(ప్రజాజ్యోతి):**ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాజీవితాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్లో భాగంగా ఆలమూరు మండలం పినపల్ల గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో బుధవారం అంగన్వాడీ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఐసీడీఎస్ సీడీపీఓ గజలక్ష్మి ఆదేశాల మేరకు సూపర్వైజర్ నాగ సత్యవేణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మాజీ సర్పంచ్ సంగీత సుభాష్,ఏఎంసీ మాజీ చైర్మన్ వక్కపట్ల లచ్చిబాబు హాజరై చిన్నారులు, వారి తల్లులతో ముచ్చటించారు. ముందుగా వారి సహకారంతో గ్రామంలోని గర్భిణీ స్త్రీలకు సాంప్రదాయ పద్ధతిలో సామూహిక శ్రీమంతాలు నిర్వహించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రం ద్వారా చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారం, ప్రీ–స్కూల్ విద్య, ఆరోగ్య సంరక్షణ సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రధాని మోదీ 25 ఏళ్ల ప్రజాసేవను పురస్కరించుకుని నిర్వహిస్తున్న కార్యక్రమాలు ప్రజల్లో సేవాభావాన్ని మరింత బలోపేతం చేస్తున్నాయని అన్నారు. చిన్నారుల శారీరక, మానసిక, సామాజిక అభివృద్ధిలో అంగన్వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. తల్లిదండ్రులు అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెద్దిరెడ్డి పట్టాభి రామయ్య, యనమదల శ్రీను, అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఈ-పంట నమోదులపై క్షేత్రస్థాయి పరిశీలన



**పొందూరు,ప్రజాజ్యోతి న్యూస్** :పొందూరు మండలంలోని దల్లవలస రెవెన్యూ గ్రామంలో ఈ–పంట నమోదులపై జాతీయ నమూనా పరిశీలన సంస్థ (ఎన్.ఎస్.ఎస్.ఓ), విశాఖపట్నం ప్రతినిధులు బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించారు. ఎన్ .ఎస్.ఎస్.ఓ సీనియర్ గణాంక అధికారి డి. వైకుంఠరావు ఆధ్వర్యంలో ఈ పరిశీలన చేపట్టారు. ఈ–పంటలో నమోదైన వివరాల నుంచి కొన్ని రికార్డులను యాదృచ్ఛిక ఎంపిక విధానంలో ఎంపిక చేసి, సంబంధిత పొలాల్లో నమోదైన పంటల వివరాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ–పంటలో నమోదు చేసిన పంట వివరాలను క్షేత్రస్థాయిలో వాస్తవంగా ఉన్న పంటలతో సరిపోల్చి తనిఖీ చేశారు.ఈ సందర్భంగా యాదృచ్ఛికంగా ఎంపిక చేసిన రికార్డులను వి. ఏ . ఏ,వి.ఆర్ ఓ,వి.ఎస్ ల సమక్షంలో క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఈ–పంట నమోదులోని వివరాలు, పొలాల్లో ఉన్న వాస్తవ పంటల వివరాలతో సరిపోలుతున్నాయా లేదా అన్నది ధృవీకరించారు. ఈ పరిశీలనలో అన్ని రికార్డుల్లోనూ 100 శాతం సరిపోలిక నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.వ్యవసాయ రంగంలో ఈ–పంట నమోదు కీలకమైనందున, కేంద్ర ప్రభుత్వం పరిశీలన కోసం ఈ అంశాన్ని ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ–పంట నమోదుల ద్వారా క్షేత్రస్థాయిలో పంటల వాస్తవ పరిస్థితిని నమోదు చేయడం, సంబంధిత వివరాలను ధృవీకరించడం జరుగుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎన్ .ఎస్.ఎస్.ఓ సీనియర్ గణాంక అధికారి డి. వైకుంఠరావు, వి. ఏ.ఏ కూన సుధీర్, వి.ఆర్.ఓ ఎం. దేవకర్ రావు, వి.ఎస్ చి. నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## బన్నీ ఉత్సవాలు.. స్థానిక ఎన్నికలు ప్రశాంతంగా సాగాలి

**గొడవలకు దూరంగా ఉండండి.. కుటుంబాల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకోండి:**

**----- ఎస్సై దిలీప్ కుమార్**





**హోళగుంద,అక్టోబర్ 7, ప్రజా జ్యోతి న్యూస్** – రాబోయే దసరా బన్నీ ఉత్సవాలు, స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హొళగుంద ఎస్సై దిలీప్ కుమార్ సూచించారు. హొళగుంద పోలీస్‌స్టేషన్ పరిధిలోని హెబ్బటం గ్రామంలో ప్రజలతో అవగాహన కార్యక్రమం నిర్వహించి పలు కీలక సూచనలు చేశారు.దసరా బన్నీ ఉత్సవాలను ప్రతి ఒక్కరూ శాంతియుత వాతావరణంలో, సంప్రదాయబద్ధంగా నిర్వహించుకోవాలని ఎస్సై సూచించారు. ఉత్సవాల సందర్భంగా చిన్నచిన్న వివాదాలకు వెళ్లి గొడవలు చేసుకోవడం ద్వారా ప్రాణాలకు ముప్పు తెచ్చుకోవద్దని, తమపై ఆధారపడిన కుటుంబ సభ్యులను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ సంయమనంతో వ్యవహరించాలని కోరారు.అలాగే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీలకు అతీతంగా శాంతియుత వాతావరణాన్ని కాపాడాలని, ఎన్నికల సమయంలో ఎలాంటి గొడవలు, ఘర్షణలకు పాల్పడవద్దని ప్రజలకు సూచించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల ప్రక్రియను నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు.సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తులకు ఓటీపీలు, బ్యాంకు వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని అందించవద్దని సూచించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని తెలిపారు.అదేవిధంగా మహిళలపై ఎలాంటి నేరాలకు పాల్పడరాదని, మహిళల భద్రతకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని సూచించారు. వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలను పాటించి, వేగంగా వాహనాలు నడపకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై దిలీప్ కుమార్ ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో పోలీసులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

# ఉన్నత చదువుకు చేయూతనిస్తున్న దీపిక గిరిజన గళం గ్రూప్--2 విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

**చింతూరు: అక్టోబర్. 7 ప్రజాజ్యోతి ప్రతినిధి రాజు పూసం**

ఆర్థిక పరిస్థితులు చదువుకు అడ్డంకిగా మారకూడదనే ఉద్దేశంతో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు దీపిక గిరిజన గళం అండగా నిలిచింది. దీపిక గిరిజన గళం చైర్మన్ దీపికా ఆధ్వర్యంలో, లైన్స్ క్లబ్ సహకారంతో గ్రూప్--2 పరీక్షకు సిద్ధమవుతున్న విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు.చింతూరు ప్రాంతానికి చెందిన నలుగురు విద్యార్థులకు, భద్రాచలం ప్రాంతంలో గ్రూప్--2 పరీక్షకు సిద్ధమవుతున్న ఆరుగురు విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, స్టడీ మెటీరియల్ అందించారు.పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు పుస్తకాలు ఎంతో అవసరమని, ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువుకు ఆటంకం కలగకూడదనే ఉద్దేశంతో ఈ సహాయం అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.“అక్షరం అందరి ఆస్తి విద్య అందరి హక్కు” అనే నినాదంతో




విద్యార్థులను చదువువైపు ప్రోత్సహించడంతో పాటు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువతకు తమ వంతు సహకారం అందిస్తామని దీపిక గిరిజన గళం ప్రతినిధులు తెలిపారు. పుస్తకాల కోసం సహకరించిన లైన్స్ క్లబ్ సభ్యురాలు




ఉషారాణి, శివ పరమేశ్వరి తదితరులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. చదువుకు చేయూత అందించే కార్యక్రమాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు.

# నిబంధనలకు విరుద్ధంగా డ్వాక్రా నుండి తొలగింపు

**న్యాయం చేయాలని ఏపీఎంను కోరిన బాధితురాలు.**

**గాలివీడు, అక్టోబర్7:**అన్నమయ్య జిల్లా గాలివీడు మండలం నూలివీడు పంచాయతీ పరిధిలోని నాగూరివాండ్లపల్లికి చెందిన ఓ పేద మహిళకు మహిళా సంఘం (డ్వాక్రా)లో అన్యాయం జరిగింది. ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా, నిబంధనలకు విరుద్ధంగా తనను సంఘం నుండి తొలగించారంటూ బాధితురాలు కె. గంగులమ్మ వాపోయారు. ఈ అన్యాయంపై సోమవారం గాలివీడు మండల సమైక్య (వెలుగు) కార్యాలయానికి విచ్చేసి, ఏపీఎం దేవసేనకు ఆమె లిఖితపూర్వక ఫిర్యాదు అందజేశారు.

**అసలు ఏం జరిగిందంటే..**

బాధితురాలు మరియు అర్జీలో పేర్కొన్న వివరాల ప్రకారం... నూలివీడు గ్రామం సమాఖ్య వివో–1 పరిధిలోని జగదీష్ స్వయం సహాయక మహిళా సంఘంలో కె. గంగులమ్మ గత కొంతకాలంగా సభ్యురాలిగా కొనసాగుతున్నారు. అయితే, ఇటీవల ఆమెకు 60 సంవత్సరాలు నిండాయనే ఏకైక కారణంతో... యానిమేటర్ కె. కళావతి మరియు గ్రూప్ లీడర్లు ఏమాత్రం సమాచారం ఇవ్వకుండా ఏకపక్షంగా వ్యవహరించారు. బాధితురాలి ప్రమేయం లేకుండా బలవంతంగా సంతకం చేయించుకుని, “ఇక నుంచి నువ్వు గ్రూపులో ఉండటానికి వీలులేదు, నిన్ను తొలగిస్తున్నాము, నీకు ఈ గ్రూపుతో ఎలాంటి సంబంధం లేదు’’ అంటూ ఆమెను సాగనంపారని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు.

**నిలదీస్తే బెదిరింపులు**

తమకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా, నియమ నిబంధనలకు విరుద్ధంగా సంఘం నుండి తొలగించడంపై బాధితురాలు గంగులమ్మ గ్రూప్ లీడర్లను, యానిమేటర్‌ను నిలదీశారు. అయితే, బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన వారు కనీస స్పందన ఇవ్వకపోగా, “ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో, మా ఇష్టం వచ్చినట్లు మేము చేసుకుంటాం” అంటూ ఆమెను బెదిరింపులకు గురిచేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

**న్యాయం చేయాలని ఏపీఎంను కోరిన అబాధితురాలు**




తనకు ఎటువంటి నోటీసు ఇవ్వకుండా అన్యాయంగా తొలగించడం వల్ల తాను ఆర్థికంగా, మానసికంగా నష్టపోతున్నానని గంగులమ్మ తెలిపారు. తన స్థానంలో వేరేవారిని చేర్చుకునే విషయంలో నిబంధనలు పాటించాలని, తనని అన్యాయంగా తొలగించిన వారిపై మరియు బెదిరింపులకు పాల్పడిన వారిపై తగిన విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని ఆమె మండల సమైక్య ఏపీఎంను కోరారు. ఈ కార్యక్రమంలో బాధితురాలు ఏపీఎంకు అర్జీని అందజేసి తన గోడు వెళ్లబోసుకున్నారు.

# గొల్లప్రోలు శివాలయంలో ఘనంగా అన్నదానం

**: ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సొంత నిధులతో సేవా కార్యక్రమం**

**గొల్లప్రోలు (ప్రజా జ్యోతి)** పిఠాపురం నియోజకవర్గ శాసనసభ్యులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు, ఆయన సొంత నిధులతో చేపట్టిన పితృదేవతల కృతజ్ఞతా సమర్పణ అన్నదాన కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. మనకు జన్మనిచ్చిన పితృదేవతలను, పూర్వీకులను స్మరించుకుంటూ పితృపక్షాల పవిత్ర సమయంలో వారికి కృతజ్ఞతలు తెలియజేయడం సనాతన సంప్రదాయం. ఈ సాంప్రదాయాన్ని గౌరవిస్తూ నియోజకవర్గ వ్యాప్తంగా 14 రోజుల పాటు 13 ప్రముఖ ఆలయాల్లో ఈ అన్నదాన సత్కార్యాన్ని పవన్ కళ్యాణ్ ప్రారంభించారు. ఇందులో భాగంగా బుధవారం గొల్లప్రోలు శివాలయంలో 11వ రోజు అన్నదాన కార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహించబడింది. ఈ పవిత్ర సత్కార్యంలో జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు మామిడాల సూరిబాబు, పార్టీ సీనియర్



నాయకులు కడారి తమ్మయ్య నాయుడు ఆధ్వర్యంలో భక్తులకు, స్థానికులకు స్వయంగా భోజనాలు వడ్డించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ.. పితృదేవతల ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలపై, రాష్ట్ర ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షిస్తూ ఈ సేవా కార్యక్రమాన్ని విజయవంతం



చేసినట్లు తెలిపారు. పవన్ కళ్యాణ్ ఈ సేవా దృక్పథంపై స్థానిక భక్తులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, జనసైనికులు, వీర మహిళలు, భక్తులు పాల్గొని పితృదేవతలకు తమ కృతజ్ఞతలను సమర్పించారు.

# అభివృద్ధి పనుల్లో జనసేన ‘దూకుడు’

## గొల్లప్రోలు 6వ వార్డులో డ్రైనేజీ పనులను పర్యవేక్షించిన కడారి తమ్మయ్య నాయుడు

**గొల్లప్రోలు (ప్రజా జ్యోతి)** గొల్లప్రోలు పులపాలక సంగం పరిధిలోని 6వ వార్డులో జరుగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులను జనసేన పార్టీ సీనియర్ నాయకులు కడారి తమ్మయ్య నాయుడు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో ఆయన ఈ పర్యటన చేపట్టారు. వార్డులో కొనసాగుతున్న పనుల పురోగతిని స్వయంగా అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కడారి తమ్మయ్య నాయుడు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారంలో జనసేన పార్టీ దూకుడు పెంచిందని పేర్కొన్నారు. గత కొంతకాలంగా 6వ వార్డు ప్రజలు సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పనులు వేగవంతం అయ్యేలా చొరవ చూపించామని తెలిపారు.నిర్మాణ పనుల్లో ఎక్కడా నాణ్యతా ప్రమాణాలు లోపించకూడదని,



కాంట్రాక్టర్లు మరియు అధికారులు సమన్వయంతో వ్యవహరించి పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు. వర్షాకాలం దృష్ట్యా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మురుగునీరు సజావుగా సాగిపోయేలా శాశ్వత ఏర్పాట్లు చేయాలన్నారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి తమ వంతు కృషి ఎల్లప్పుడూ కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, జనసైనికులు పాల్గొన్నారు.

# బీసీవై పార్టీ రాష్ట్ర సమన్వయ కమిటీ సమావేశాన్ని విజయవంతం చేయండి

**8న కర్నూలు అంబేద్కర్ భవన్‌లో కీలక సమావేశం**

**ఎల్లార్తి అర్జున్ వాల్మీకి పిలుపు**



**హోళగుంద, అక్టోబర్ 7, ప్రజా జ్యోతి న్యూస్** - రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బీసీవై పార్టీ రాష్ట్ర సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీన కర్నూలు అంబేద్కర్ భవన్‌లో నిర్వహించనున్న సమావేశాన్ని విజయవంతం చేయాలని బీసీవై పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎల్లార్తి అర్జున్ వాల్మీకి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, యువత, మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, బడుగు బలహీన వర్గాల ప్రజలకు పిలుపునిచ్చారు. బీసీవై పార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్ ఆదేశాల మేరకు రాష్ట్ర స్థాయి కమిటీ సభ్యులు కర్నూలు జిల్లాలో పర్యటించి పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ తరఫున పోటీ చేయాలనే ఆసక్తి ఉన్న నాయకులు, యువత, మహిళలకు రాజకీయంగా ఎదిగేందుకు అవకాశాలు కల్పించడమే సమావేశం ప్రధాన ఉద్దేశమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలను గుర్తించి, వాటిపై నివేదికలు రూపొందించడంతో పాటు బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి నిరంతరం ప్రజలకు అండగా నిలిచే నాయకులను స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రోత్సహించేందుకు పార్టీ చర్యలు చేపడుతోందని అర్జున్ వాల్మీకి తెలిపారు. ఈ సమావేశానికి కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, పత్తికొండ, మంత్రాలయం, ఆదోని, ఆలూరు నియోజకవర్గాల నుంచి ఆసక్తి ఉన్న యువకులు, నాయకులు, మహిళలు, పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలివచ్చి సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం



**ఆలమూరు అక్టోబర్ 7(ప్రజాజ్యోతి):** రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల్లో విద్యాబోధన కోసం అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను తాత్కాలికంగా నియమించేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో భాగంగా ఆలమూరు మండలంలోని మూలస్థాన అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్) అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు మండల విద్యాశాఖాధికారి ఎంఈఓ 1 బి.అప్పాజీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో డిగ్రీతో పాటు బి.ఈడి పూర్తిచేసి, టెట్ అర్హత సాధించిన స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. నెలకు రూ.12,500 గౌరవ వేతనం చెల్లిస్తారని, వేసవి సెలవుల్లో వేతనం ఉండదని స్పష్టం చేశారు. ఎంపిక ప్రక్రియ జిల్లా సెలెక్షన్ కమిటీ డీఎస్సీ ద్వారా జరుగుతుందని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు అక్టోబర్ 8, 9 తేదీల్లో తమ దరఖాస్తులను ఆలమూరు మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. పూర్తి వివరాలకు ఎంఈఓ కార్యాలయాన్ని సంప్రదించవచ్చు అన్నారు.

## పారా మెడికల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ వైద్య ఉద్యోగుల సమ్మె



**బుట్టాయగూడెం అక్టోబర్ 07(ప్రజాజ్యోతి):-** తమ డిమాండ్లను పరిష్కరించే వరకు విధులకు హాజరయ్యే ప్రసక్తే లేదని జేఏసీ,ఆదివాసి మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ స్పష్టం చేశారు. మండలంలోని కోట రామచంద్రాపురం ఐటిడిఎ దగ్గర బుధవారం కాంట్రాక్టు వైద్య ఉద్యోగులు గిరిజన స్వాతంత్ర సమరయోధుల విగ్రహాలకు నివాళులర్పించి సమ్మె నిర్వహించారు. ఏలూరు జిల్లాలోని గిరిజన ప్రాంతంలోని సుమారు 98 మంది కాంట్రాక్టు ఉద్యోగులు సాధారణ,అత్యవసర వైద్య సేవలను పూర్తిగా బహిష్కరించారు. దీనిలో భాగంగా ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న 15 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు,రెండు సామాజిక ఆరోగ్య కేంద్రాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు అందరూ విధులు బహిష్కరించి ఐటిడిఏ కేఆర్ పురం ప్రాజెక్ట్ ఆఫీసర్ వారి కార్యాలయం ఎదుట శిబిరం ఏర్పాటు చేసి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా జేఏసీ,ఆదివాసి మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ తమ డిమాండ్లను పరిష్కరించే వరకు విధులకు హాజరయ్యే ప్రసక్తే లేదని అన్నారు. అలాగే ప్రభుత్వం నుంచి ఏదైనా స్పష్టమైన హామీలు వచ్చేదాకా ఈ సమ్మె విరమింపబోమని అన్నారు. తమవి రెండే రెండు డిమాండ్లు అని అన్నారు. అందులో ఒకటి చాలా సంవత్సరాలుగా కాంట్రాక్ట్ పద్ధతిలో సేవలు అందిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సర్వీసును తక్షణమే క్రమబద్ధీకరించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. రెండవదిగా తమ సేవలు క్రమబద్ధీకరించే వరకు రెగ్యులర్ ఉద్యోగులతో సమాన వేతనం అనగా 100% గ్రాస్ శాలరీ చెల్లించి తమను ఆదుకోవాలని కోరారు. ఆదివాసి ఐక్య కార్యాచరణ కమిటీ రాష్ట్ర వైస్ చైర్మన్ మొడియం శ్రీనివాసరావు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సమ్మెకు మద్దతు తెలియజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు వైద్య ఉద్యోగుల సేవలను గుర్తించి రెగ్యులర్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. న్యాయమైన ఈ సమ్మెకు రాష్ట్రంలో ఉన్నటువంటి గిరిజన సంఘాలన్నీ మద్దతుగా ఉంటాయని ఆయన తెలియజేశారు. ఆల్ ఇండియా ట్రైబల్ ఫోరం స్టేట్ కన్వీనర్ ఎస్ రాంమోహన్,ఎఐకెఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కారం రాఘవ, ఏలూరు జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యులు సోదేం ముక్కయ్య,పిడిఎస్యు జిల్లా కార్యదర్శి బన్నే వినోదకుమార్ సమ్మెకు మద్దతు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దుర్గా ప్రసాద్, ఆదివాసీ మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ స్టేట్ జనరల్ సెక్రటరీ పూసం వెంకటేశ్వరావు, జిల్లా ప్రెసిడెంట్ సున్నం శ్రీ రాములు దొర,వంగా శ్రీను,ముత్యాలమ్మ, పోశమ్మ,స్టాఫ్ నర్స్ ఫార్మసీ ఆఫీసర్ లాబ్ టెక్నీషియన్, హెల్త్ అసిస్టెంట్,రేడియా గ్రాఫి, ఏఎన్ఎం పాల్గొన్నారు

## రహదారి సౌకర్యం లేక అమలగూడ గ్రామ ప్రజలు ఇక్కట్లు.



**అనంతగిరి మండలం. అక్టోబర్ 7. ప్రజా జ్యోతి న్యూస్. రిపోర్టర్ శంకర్** అల్లూరి సీతారామరాజు జిల్లా. అనంతగిరి మండలం. అనంతగిరి పంచాయతీ. అమలగూడ గ్రామానికి రహదారి సౌకర్యం లేక గ్రామ గిరిజనులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారని మండల హ్యూమన్ రైట్స్ ప్రతినిధి సి.హెచ్ రమేష్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ బుధవారం నాడుస్థానిక విలేకరులకు తెలిపారు. రహదారి నిర్మాణం కొరకు గత వైయస్సార్ ప్రభుత్వంలో నిధులు మంజూరు అయితే నిధులు దుర్వినియోగం చేశారు తప్ప రహదారి పనులు చేపట్టలేదని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం నాయకులు స్పందించి రహదారి నిర్మాణం కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఆయన కోరారు.

## ఆర్ఆర్బీహెచ్ఆర్ విద్యాసంస్థల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్న 180 మంది పూర్వ విద్యార్థులు**



**పిఠాపురం, అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి):** పిఠాపురంలోని ఆర్ఆర్బీహెచ్ఆర్ జూనియర్ కళాశాల, హైస్కూల్‌లో వివిధ గ్రూపుల్లో చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం బుధవారం ఘనంగా నిర్వహించారు. పిఠాపురం మహారాజా వారి కోటలోని రెడ్డి రాజా కళ్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రముఖుడు బొజ్జ వీరవెంకట అప్పారావు ఆధ్వర్యం వహించారు. ఈ సందర్భంగా సుమారు 180 మంది పూర్వ విద్యార్థులు ఒకచోట చేరి తమ విద్యాభ్యాస కాలంలోని మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఎన్నో ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. పాఠశాల, కళాశాల రోజుల్లోని అనుభవాలను గుర్తుచేసుకుని, అప్పటి స్నేహితులతో సరదాగా గడిపారు. అనంతరం ఆర్ఆర్బీహెచ్ఆర్ విద్యాసంస్థల పూర్వ విద్యార్థుల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొజ్జ వీరవెంకట అప్పారావు, ఉపాధ్యక్షుడిగా పైడా సత్యనారాయణ, కార్యదర్శిగా చక్రవర్తుల సూర్యారావు, కోశాధికారిగా తోట ఏడుకొండలను ఎన్నుకున్నారు. ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా చెక్క రామకృష్ణ, కే. శ్రీనివాస్‌రెడ్డి, పెండ్యాల సుదర్శనరావు, కొత్తేం రాంబాబు, పైండా శ్రీనివాసరావు, తాటికొండ సత్యనారాయణ, రెడ్డెం సత్యనారాయణమూర్తి, చక్రవర్తుల జగన్నాథరావు, పేకేటి రమేష్, కొట్టెం మోహన్‌రావు, బాలెం నూకరాజు, దూల కృష్ణ తదితరులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సీఈసీ జ్ఞానేశ్వర్‌కుమార్‌ను వెంటనే తొలగించాలి

**- ఓట్ల తొలగింపుతో ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్నారు**

**- ఇండియా కూటమి నేతల డిమాండ్**



**ఆమదాలవలస , ప్రజాజ్యోతి న్యూస్ :** కేంద్ర ప్రభుత్వం ఓట్ల చోరీకి పాల్పడుతూ ప్రజల ఓటు హక్కును కాలరాస్తోందని ఇండియా కూటమి నేతలు ఆరోపించారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్వర్‌కుమార్‌ను వెంటనే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో డీసీసీ అధ్యక్షులు సనపల అన్నాజీరావు అధ్యక్షతన ఇండియా కూటమి నేతల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ పోటీ చేసిన నియోజకవర్గంలో సుమారు 40 వేలకుపైగా ఓట్లు, తమిళనాడులో స్టాలిన్ పోటీ చేసిన నియోజకవర్గంలో సుమారు 40 వేల ఓట్లు, ఢిల్లీలో కేజ్రీవాల్ పోటీ చేసిన నియోజకవర్గంలో సుమారు 55 వేల ఓట్లు తొలగించారని ఆరోపించారు. ఓట్ల తొలగింపు చర్యలతో ప్రతిపక్ష అభ్యర్థుల ఓటమికి కారణమయ్యారని విమర్శించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ కుటిల రాజకీయాలతో ప్రజాస్వామ్య వ్యవస్థను అపహాస్యం చేస్తున్నాయని మండిపడ్డారు. ఎన్నికల కమిషన్ కేంద్ర ప్రభుత్వం చేతిలో కీలుబొమ్మగా మారిందని ఆరోపించారు. సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చిందంటూ సీఈసీ జ్ఞానేశ్వర్‌కుమార్ పేర్కొనడాన్ని వారు తప్పుబట్టారు. తాము అలా చెప్పలేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సీఈసీ జ్ఞానేశ్వర్‌కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఇండియా కూటమి ఆధ్వర్యంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ కళాశాల జంక్షన్ వద్ద అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, ప్రజాసంఘాల నాయకులు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ ఎంపీపీ బొడ్డేపల్లి గోవింద గోపాల్, ఐలు జిల్లా గౌరవ అధ్యక్షులు బొడ్డేపల్లి మోహనరావు, ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బొడ్డేపల్లి జనార్దనరావు, సీపీఎం సీఐటీయూ సరుబుజ్జిలి మండల కార్యదర్శి అదపాక రాజేష్, పట్టణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ ఉపాధ్యక్షులు ఎం.కూర్మారావు, కాంగ్రెస్ నాయకులు బస్వా షణ్ముఖరావు, గోలపల్లి దాలయ్య, సనపల రాజులు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ జెడ్పీటీసీ లోలుగు కాంతారావు కు మాతృవియోగం



**పొందూరు ,ప్రజా జ్యోతి న్యూస్ :** పొందూరు మండల మాజీ జెడ్పీటీసీ ,వైఎస్సార్సీపీ నాయకులు లోలుగు కాంతారావు మాతృవియోగం చెందరు వృద్ధాప్యంతో బాధపడుతున్న ఆమె బుధవారం ఉదయం లోలుగు గ్రామం లోని స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. కాంతారావు పార్టీలకు అతీతంగా ప్రజాభిమానం కలిగిన నాయకుడు కావడంతో మండలంతో పాటు పరిసర గ్రామాల ప్రజానీకం , వారి బంధువులు , ప్రముఖ పార్టీ ముఖ్య నాయకులు లోలుగు గ్రామానికి తరలివచ్చారు. మరణ వార్తలు విన్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం విజయనగరం పార్లమెంటరీ పరిశీలకులు కిల్లి వెంకట సత్యన్నారాయణ వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి ( పార్లమెంట్ ) దుంపల రామారావు ఆమదాలవలస నియోజకవర్గం సమన్వయ కర్త చింతాడ రవికుమార్,వైకాపా జిల్లా అధికార ప్రతినిధి కోట గోవింద రావు శ్రీకాకుళం జిల్లా మహిళా కార్యదర్శి కోట తేజావతి ,యువనేత చిరంజీవి నాగ్ ,మండల పార్టీ అధ్యక్షులు కొంచాడ రమణ మూర్తి ,పప్పల రమేష్ కుమార్,పప్పల మున్నా, కాంతారావుకు తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

## పామిడి పోలీస్ స్టేషన్ నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన బి. మనోహర్



**ప్రజా జ్యోతి జిల్లా బ్యూరో సుబ్బు** పామిడి పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ (సర్కిల్ ఇన్స్పెక్టర్ ) గా బి. మనోహర్ బాధ్యతలు స్వీకరించారు. నిన్నటి వరకు ఇక్కడ విధులు నిర్వహించిన సీఐ బదిలీ కావడంతో, వారి స్థానంలో నూతనంగా నియమితులైన బి. మనోహర్ పోలీస్ స్టేషన్‌లో అధికారికంగా బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా నూతన సీఐ మనోహర్ మాట్లాడుతూ పామిడి మండల పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు మొదటి ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, పోలీస్ శాఖకు ప్రజలు పూర్తి సహకారం అందించాలని ఆయన కోరారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సీఐ బి. మనోహర్ ని పోలీస్ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

## వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ ఐడి కార్డులు రెండవ రోజు పంపిణీ



**అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం గోడితిప్ప గ్రామం ప్రజా జ్యోతి ప్రతినిధి** గోడితిప్ప గ్రామంలో వైయస్సార్సిపి గ్రామ కమిటీ ఐడి కార్డులు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నటువంటి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఆర్టిఐ జోన్ టు అధ్యక్షులు కొల్లు త్రినాథ్ వర్మ అధ్యక్షతన ఐడి కార్డులు పంపిణీ కార్యక్రమం రెండవ రోజు దిగ్విజయంగా జరిగింది. ఈ కార్యక్రమంలోజూన్ టు అధ్యక్షులు కొల్లు త్రినాధర్మతో పాటు గోడు తిప్ప గ్రామ కమిటీ ఉపాధ్యక్షులు కొప్పడివెర్రి కూడా పాల్గొనడం జరిగింది ఈ కార్యక్రమం విజయవంతం చేయడంలో సాయంగా ప్రతి ఒక్క కార్యకర్త ఆయన వెంట పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## విజయవాణి హైస్కూల్‌లో శక్తి యాప్‌పై అవగాహన




**ప్రజా జ్యోతి నందికొట్కూరు** నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ ఐపీఎస్ ఆదేశాల మేరకు, ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్ ఉత్తర్వులతో నందికొట్కూరు టౌన్ యూపీఎస్ సీఐ అశోక్ కుమార్, ఎస్ఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆత్మకూరు సబ్‌డివిజన్ శక్తి టీం బుధవారం నందికొట్కూరులోని విజయవాణి హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించింది. హెచ్ఎం వేణుగోపాల్ రెడ్డి, కరస్పాండెంట్ రామసుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు, 8, 9వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శక్తి యాప్, 7993485111 నంబర్ గురించి విద్యార్థులకు వివరించారు. ఆపద సమయంలో శక్తి యాప్ ద్వారా 112కు సమాచారం అందిస్తే పోలీసుల సహాయం అందుతుందని తెలిపారు. ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, పాఠశాలకు వచ్చేటప్పుడు లేదా వెళ్లేటప్పుడు ఎవరైనా వెంటపడి ఇబ్బంది పెట్టినా వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు. సైబర్ నేరాల్లో డబ్బులు పోయిన వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని అవగాహన కల్పించారు. మైనర్లు ద్విచక్ర వాహనాలు నడపకూడదని, నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేసే అవకాశం ఉందని హెచ్చరించారు. తల్లిదండ్రులు ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. పోక్సో చట్టంపై కూడా విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ, చెడు ఆకర్షణలకు లోనుకాకుండా చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు. చదివిన విషయాలను గుర్తుంచుకోవడానికి 147 రూల్ ప్రకారం పునశ్చరణ చేయాలని తెలిపారు. కార్యక్రమం అనంతరం పాఠశాల ఉపాధ్యాయుల మొబైళ్లలో శక్తి యాప్‌ను ఇన్‌స్టాల్ చేయించి, విద్యార్థులు ఇంటికి వెళ్లిన తర్వాత తమ తల్లిదండ్రుల మొబైళ్లలో కూడా శక్తి యాప్‌ను ఇన్‌స్టాల్ చేయించుకోవాలని సూచించారు.

# చెన్నంపల్లిలో తాగునీటి కష్టాలు





**కాళీ బిందెలతో రోడ్డెక్కిన మహిళలు.. రాస్తారోకో**

**కంబదూరు అక్టోబర్:7 (ప్రజా జ్యోతి) న్యూస్ రిపోర్టర్ ఖాన్,** కంబదూరు మండలం చెన్నంపల్లి గ్రామంలో గత మూడు నెలలుగా తాగునీటి సమస్య పరిష్కారం కాకపోవడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యపై ఆగ్రహం వ్యక్తం చేసిన మహిళలు బుధవారం కాళీ బిందెలతో ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. కొన్ని గంటలపాటు వాహనాలను నిలిపివేసి తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. తాగునీటి కోసం సమీపంలోని వ్యవసాయ తోటల బోర్ల వద్దకు కాలినడకన వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు.సకాలంలో వర్షాలు కురవకపోవడంతో గ్రామ పరిధిలోని పలు బోర్లు ఎండిపోయాయని, వ్యవసాయ బోర్లలోనూ అరకొరగా నీరు వస్తోందని తెలిపారు. అయినప్పటికీ రైతులు తమ పంటలకు నీటిని సర్దుబాటు చేసుకుంటూ గ్రామస్థుల దాహార్తిని తీరుస్తున్నారని పేర్కొన్నారు.అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి నీటి సమస్యను గుర్తించి, ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలని మహిళలు డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్దకు వెళ్లి నిరసన చేపడతామని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెన్నంపల్లి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్థులు కోరారు.

## కాకినాడ జిల్లా కోర్టుకు హాజరైన జనసేన నాయకులు



**కాకినాడ (ప్రజా జ్యోతి)** గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో నమోదైన కేసుల విచారణలో భాగంగా జనసేన పార్టీ ముఖ్య నాయకులు బుధవారం కాకినాడ జిల్లా కోర్టుకు హాజరయ్యారు. గత ప్రభుత్వ హయాంలో కాకినాడ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి జనసేన అధినేతపై చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను ఖండిస్తూ, ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ అప్పట్లో జనసేన శ్రేణులు శాంతియుతంగా నిరసన తెలిపాయి. ఆ సమయంలో తమపై వైకాపా శ్రేణులు దాడి చేయడమే కాకుండా, తిరుగుటపాలో తమపైనే అక్రమంగా, తప్పుడు కేసులు బనాయించారని జనసేన నాయకులు ఈ సందర్భంగా ఆరోపించారు. చట్టంపై, న్యాయస్థానాలపై తమకు పూర్తి నమ్మకం ఉందని వారు స్పష్టం చేశారు.కోర్టుకు హాజరైన వారిలో్న తుమ్మల రామస్వామి కాకినాడ జిల్లా జనసేన అధ్యక్షులు, డీసీసీబీ చైర్మన్ పంచకర్ల సందీప్ రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు,బండార శ్రీనివాస్ కొత్తపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్, పెంకే జగదీష్ ఆంధ్రప్రదేశ్ బీసీ కార్పొరేషన్ డైరెక్టర్, నాగ మానస ఆంధ్రప్రదేశ్ చిల్డ్రన్ బోర్డు సభ్యురాలు,రాష్ట్ర కార్యదర్శులు తాటికాయల వీరబాబు, సంగిశెట్టి అశోక్, సుంకర కృష్ణవేణి నున్న గణేష్ నాయుడు, మర్రి దొరబాబు, కర్రెడ్ల గోవిందు, ఆది, ఫాజిల్, కొప్పిశెట్టి శ్రీను, రానా వెంకటరాజు, నాగబాబు. లీగల్ సెల్ ప్రతినిధులు అడ్వకేట్ చంటి, మల్లి బాబు తదితరులతో పాటు జనసేన నాయకులు, వీర మహిళలు కోర్టుకు తరలివచ్చారు

## రైతులందరూ వెంటనే ఈ-క్రాప్ ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలి.. కౌతాళం మండల వ్యవసాయ అధికారి శేషాద్రి



**కౌతాళం,అక్టోబర్ 07 ప్రజా జ్యోతి** కౌతాళం ఖరీఫ్ పంటల ఈ-క్రాప్ ఈ-కేవైసీ ప్రక్రియకు సమయం తక్కువగా ఉన్నందున, రైతులందరూ వెంటనే తమ నమోదును పూర్తి చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శేషాద్రి పిలుపునిచ్చారు.ప్రభుత్వం నుంచి అందే ఉచిత పంటల బీమా, సున్నా వడ్డీ రుణాలు, ఇన్-పుట్ సబ్సిడీ, మరియు మద్దతు ధరకు ధాన్యం విక్రయించాలన్నా ఈ-కేవైసీ తప్పనిసరి అని ఆయన స్పష్టం చేశారు. రైతులు ఆలస్యం చేయకుండా తమ పరిధిలోని రైతు భరోసా కేంద్రం ఆర్.బి.కే లేదా గ్రామ సచివాలయానికి వెళ్లి బయోమెట్రిక్ వేలిముద్ర లేదా ఆధార్ ఓటీపీ ద్వారా ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చు.అలాగే, రైతులు స్వయంగా ఏపీఏఐఎంఎస్ యాప్ ద్వారా లేదా లింక్ ద్వారా కూడా తమ ఈ-కేవైసీని త్వరితగతిన పూర్తి చేసుకోవాలని ఆయన కోరారు.

# ఫారెస్ట్ భూమి ఆక్రమణ

**రోడ్డు అంచున అక్రమ దుకాణాలు**



**కుక్కునూరు,ప్రజా జ్యోతి,అక్టోబర్ 7:** మండలంలోని ఇబ్రహీంపేట క్రాస్ రోడ్డు వద్ద రిజర్వ్ ఫారెస్ట్ కు చెందిన విలువైన భూమిని కొందరు ఆక్రమించుకుని ఆర్ అండ్ బి రోడ్డును ఆనుకుని అంచుల్లో అక్రమంగా భారీ దుకాణాలు నిర్మించి వ్యాపారాలు చేస్తున్నారు. ఎలాంటి ఫారెస్ట్,పంచాయతీ, ఆర్ అండ్ బి అనుమతులు లేకుండా వ్యాపారాలు నిర్వహిస్తూ, నిబంధనల ప్రకారం ఆర్ అండ్ బి రోడ్డు మార్జిన్ లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదు,ఫారెస్ట్ భూమిలో అడుగు పెట్టకూడదు.అయినా అధికారులకు తెలియదా అంటూ స్థానికులు విమర్శలు చేస్తున్నారు. ఫారెస్ట్ అధికారులు, పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారు.రోడ్డు అంచున దుకాణాలు ఉండటంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నా చర్యలు లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని స్థానికులు వాపోతున్నారు.ఈ దుకాణాల విషయంలో చోటు ఆపుకోవటానికి చిన్న చిన్న ఘర్షణలు కూడా చేసుకుంటున్నట్టు సమాచారం ఇప్పటికైనా సంబంధిత డిఎఫ్ఓ,ఆర్ అండ్ బి,విద్యుత్ శాఖ అధికారులు సంయుక్తంగా విచారణ జరిపి అక్రమ దుకాణాలను తొలగించి,అక్రమ దుకాణాలు పై కరెంటు సరఫరాపై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# మద్దిలేటి ఆలయ అభివృద్ధికి సర్కారు భరోసా

**ఉత్తర రాజగోపురం, ప్రాకార నిర్మాణానికి సహకారం కోరిన ఎమ్మెల్యే కోట్ల**

**దేవాదాయ మంత్రి, కమిషనర్‌కు వినతిపత్రం**



**నంద్యాల జిల్లా:బ్యూరో అక్టోబర్7(ప్రజా జ్యోతి)** నంద్యాల జిల్లా బేతంచెర్ల మండలం ఆర్.ఎస్.రంగాపురంలోని శ్రీ మద్దిలేటి నరసింహస్వామి దేవస్థానం అభివృద్ధికి అవసరమైన నిధులు, అనుమతులు మంజూరు చేయాలని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి కోరారు. దేవస్థానం చైర్మన్ ఉన్నం ఎల్ల నాగయ్యతో కలిసి బుధవారం విజయవాడలో దేవాదాయ శాఖ మంత్రి ఆనం నారాయణరెడ్డి, కమిషనర్ కె. రామచంద్ర మోహన్‌లను కలిసి వినతిపత్రం సమర్పించారు.దేవస్థానంలో ఉత్తర రాజగోపురం నిర్మాణానికి అవసరమైన మార్గం అభివృద్ధి, ప్రాకార నిర్మాణంతో పాటు భక్తులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులను వినతిపత్రంలో ప్రస్తావించారు. ఈ పనులకు అవసరమైన అనుమతులు మంజూరు చేయడంతో పాటు నిధులు కేటాయించి సహకరించాలని కోరారు.ఈ సందర్భంగా స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను మంత్రి ఆనం నారాయణ రెడ్డి, కమిషనర్ కె. రామచంద్ర మోహన్‌లకు అందజేశారు. దేవస్థానం అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలించిన మంత్రి, కమిషనర్.. నిబంధనల మేరకు తగిన చర్యలు తీసుకుని అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.మద్దిలేటి నరసింహస్వామి దేవస్థానం అభివృద్ధితో భక్తులకు మరిన్ని సౌకర్యాలు అందుబాటులోకి రావడంతో పాటు ఈ ప్రాంతంలో ఆధ్యాత్మిక పర్యాటకానికి మరింత ప్రోత్సాహం లభించనుందని దేవస్థానం ప్రతినిధులు తెలిపారు.

# చెత్తను సంపదగా మార్చాలి

**వర్మీ కంపోస్టు తయారీపై అవగాహన కార్యక్రమం**




**బేతంచెర్ల, అక్టోబర్ 07(ప్రజా జ్యోతి)** చెత్తను సమస్యగా కాకుండా సంపదగా మార్చే దిశగా ప్రతి గ్రామపంచాయతీ పనిచేయాలని జిల్లా పంచాయతీ అధికారులు సూచించారు. బేతంచెర్ల మండలం కోలుములపల్లి గ్రామపంచాయతీలో 'చెత్త నుంచి సంపద' కార్యక్రమంలో భాగంగా వర్మీ కంపోస్టు తయారీపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీల్లో సేకరిస్తున్న తడి చెత్తను సక్రమంగా వినియోగించుకోవడం ద్వారా నాణ్యమైన వర్మీ కంపోస్టును తయారు చేయవచ్చని అధికారులు తెలిపారు. వర్మీ కంపోస్టు తయారీ విధానం, దాని వల్ల కలిగే ప్రయోజనాలు, గ్రామపంచాయతీలకు ఆదాయం సమకూర్చుకునే అవకాశాల ను పంచాయతీ అభివృద్ధి అధికారులు, షేడ్ మిత్రలు, క్లాప్ మిత్రలకు వివరించారు. తడి, పొడి చెత్తను ఇంటి వద్దనే వేరు చేసి సేకరించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లను సమర్థవంతంగా వినియోగించుకుని సేంద్రియ వ్యర్థాలను వర్మీ కంపోస్టుగా మార్చాలని తెలిపారు. తద్వారా గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపడటంతో పాటు సేంద్రియ ఎరువుల తయారీ ద్వారా గ్రామపంచాయతీలకు అదనపు ఆదాయం లభిస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల ప్రజా అభివృద్ధి అధికారి ఎం. ఫజల్ రహిమాన్, డిప్యూటీ ఎంపీడీవో బి. మల్లికార్జున, పంచాయతీ అభివృద్ధి అధికారులు, షేడ్ మిత్రలు, క్లాప్ మిత్రలు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు. గ్రామాల పరిశుభ్రతతో పాటు వ్యర్థాల సమర్థవంతమైన నిర్వహణ, సేంద్రియ ఎరువుల తయారీ ద్వారా గ్రామపంచాయతీలను స్వయం సమృద్ధి దిశగా తీసుకెళ్లడమే 'చెత్త నుంచి సంపద' కార్యక్రమం లక్ష్యమని అధికారులు తెలిపారు.

## నూతన మద్యం షాపుల నిర్వహణకు దరఖాస్తులు

- పొందూరు, జి.సిగడాం మండలాల్లో 5 షాపులకు 20 దరఖాస్తులు
- గురువారం లాటరీ ద్వారా ఎంపిక
- ఎక్సైజ్ సి. ఐ లీలా రాణి



**పొందూరు , ప్రజాజ్యోతి న్యూస్:** గత నెల 30వ తేదీతో ప్రస్తుత మద్యం షాపుల గడువు ముగియనున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం నూతన మద్యం షాపుల నిర్వహణకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా పొందూరు ఎక్సైజ్ పరిధిలోని పొందూరు మండలంలో నాలుగు మద్యం షాపులకు, జి.సిగడాం మండలంలోని బాతువలో ఒక షాపుకు కలిపి మొత్తం ఐదు షాపులకు 20 దరఖాస్తులు వచ్చినట్లు పొందూరు ఎక్సైజ్ సీఐ లీలా రాణి తెలిపారు.దరఖాస్తుదారుల నుంచి స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించిన అనంతరం అర్హులైన వారిలో నుంచి లాటరీ పద్ధతిలో నూతన మద్యం షాపుల నిర్వాహకుల ను ఎంపిక చేయనున్నారు. ఈ నెల 8వ తేదీ గురువారం శ్రీకాకుళం నగరంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో జిల్లా అధికారుల సమక్షంలో ఉదయం 8 గంటలకు లాటరీ నిర్వహించ నున్నట్లు సీఐ తెలిపారు.లాటరీ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించి అర్హత పొందిన దరఖాస్తుదారులను ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు

## కలవచర్ల గ్రామంలో ఘనంగా అంగన్వాడీ ఉత్సవం,గర్భిణులకు సీమంతాలు.. పౌష్టికాహారంపై అవగాహన.



**ఆలమూరు, అక్టోబర్ 7(ప్రజాజ్యోతి):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 సంవత్సరాల ప్రజాసేవను పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప్ అభియాన్' లో భాగంగా ఆలమూరు మండలం కలవచర్ల గ్రామ సచివాలయంలో అంగన్వాడీ ఉత్సవ్, పోషణ మాసం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని పాటించడంతో పాటు పౌష్టికాహారం తీసుకోవాల్సిన అవసరంపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. తల్లి, బిడ్డల ఆరోగ్యంపై శ్రద్ధ వహించడమే ప్రభుత్వ కార్యక్రమాల ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.కార్యక్రమంలో తృణధాన్యాలు, ఆకుకూరలు, వివిధ రకాల పౌష్టికాహార వంటకాలతో ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.అనంతరం అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లను సత్కరించారు. అంగన్వాడీ హెల్పర్‌గా సేవలందించి పదవీ విరమణ పొందిన తోకల రాజ్యలక్ష్మికి ఘనంగా సత్కారం చేసి వీడ్కోలు పలికారు.ఐసీడీఎస్ సీడీపీఓ గజలక్ష్మి ఆదేశాల మేరకు సూపర్‌వైజర్ నాగ సత్యవేణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ దాసరి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కోలపర్తి సురేష్, కలవచర్ల గ్రామ మాజీ సర్పంచ్ గుంటూరు సత్యనారాయణ మూర్తి, జనసేన పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు గుత్తుల నాగేశ్వర రావు, బీజేపీ గ్రామశాఖ అధ్యక్షులు గుత్తుల శ్రీనివాస్, జనసేన పార్టీ గ్రామశాఖ ఉపాధ్యక్షులు చీకట్ల సతీష్, జనసేన పార్టీ నాయకులు వాసంశెట్టి వెంకటేష్, కూటమి నాయకులు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి జనసేన నాయకులు గొర్లి నాగేశ్వరరావు ఆర్థిక సహాయం

**అభినందనలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే వరుపులు సుబ్బారావు**



**శంఖవరం, అక్టోబర్ 7 (ప్రజాజ్యోతి న్యూస్):** శంఖవరం మండలం కొంతంగి కొత్తూరు గ్రామానికి చెందిన పాలకొండ నాగేశ్వరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను జనసేన పార్టీ నాయకులు పరామర్శించి అండగా నిలిచారు. మండల జనసేన పార్టీ నాయకులు గొర్లి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ప్రత్తిపాడు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు, జనసేన పార్టీ నాయకులు వరుపుల సుబ్బారావుతో కలిసి జనసేన నాయకులు నాగేశ్వరావు కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడి భార్య సన్యాసమ్మను కలిసి ధైర్యం చెప్పి, కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.కుటుంబానికి తక్షణ సహాయం అందించేందుకు 50 కేజీల బియ్యంతో పాటు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కష్టకాలంలో బాధిత కుటుంబానికి అండగా నిలవడం తమ బాధ్యతగా భావిస్తున్నామని నాయకులు తెలిపారు. కుటుంబానికి ఎటువంటి అవసరం వచ్చినా తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా గొర్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ, పాలకొండ నాగేశ్వరావు మృతి తమను తీవ్రంగా కలచివేసిందన్నారు. బాధలో ఉన్న కుటుంబాలకు ఆపన్నహస్తం అందించడం ద్వారా మానవతా విలువలను చాటుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. నాగేశ్వరావు కుటుంబానికి జనసేన నాయకులు, కార్యకర్తలు ఎల్లప్పుడూ అండగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మేకల కృష్ణ, కరణం రాజారావు, తిరుమలరెడ్డి బాబురావు, జనసేన నాయకులు, వీర మహిళలు, స్థానిక కార్యకర్తలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ బలోపేతానికి కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలి




**బేతంచర్ల:అక్టోబర్7(ప్రజా జ్యోతి)** తెలుగుదేశం పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ సూచించారు. బేతంచర్ల పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో పట్టణ, మండల నాయకులు, కార్యకర్తలతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారం, పార్టీ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించడం తదితర అంశాలపై నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ప్రతి కార్యకర్త పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో డోన్ నియోజకవర్గ అబ్జర్వర్ గోవర్ధన్ రెడ్డి పాల్గొని నాయకులు, కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. పార్టీ అభివృద్ధికి ఐక్యంగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గంలో భూసర్వే, రహదారి పనులకు శ్రీకారం



**బాపట్ల అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** బాపట్ల నియోజకవర్గంలో రైతులకు నూతన పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీతో పాటు, గ్రామాల మధ్య రవాణా సౌకర్యాల మెరుగుదలకు నూతన రహదారి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. కంకటపాలెం గ్రామంలో సమగ్ర భూ రీ,సర్వే పూర్తయిన నేపథ్యంలో రైతులకు నూతన పట్టాదారు పాస్‌పుస్తకాలను ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు పంపిణీ చేశారు. అత్యాధునిక భద్రతా ప్రమాణాలు, అధికారిక రాజముద్రతో రూపొందించిన నూతన పాస్‌పుస్తకాల వల్ల రైతుల భూములకు మరింత రక్షణ లభిస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. భూ వివాదాలకు పరిష్కారం చూపడంతో పాటు భూ రికార్డులను పక్కాగా నిర్వహించేందుకు రీ,సర్వే దోహదపడుతుందన్నారు. భవిష్యత్తులో భూములకు సంబంధించిన సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో హరికుమార్, తహసీల్దార్ సలీమా, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు. మరోవైపు కర్లపాలెం మండలం పేరలిలో రూ.2 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పేరలి,తుమ్మల పల్లి నూతన రహదారి నిర్మాణ పనులకు ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు శంకుస్థాపన చేశారు. భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. రహదారి నిర్మాణం పూర్తయితే పేరలి, తుమ్మలపల్లి గ్రామాల మధ్య రాకపోకలు మెరుగుపడి స్థానిక ప్రజల ప్రయాణ ఇబ్బందులు తగ్గనున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎంపీ ల్యాడ్స్ పనులు వేగవంతం చేయాలి

**నాణ్యతతో పూర్తి చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశం**



**బాపట్ల,శ్రీ అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** బాపట్ల నగరంలో ఎంపీ ల్యాడ్స్ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ వాసుదేవ అధికారులను ఆదేశించారు. బుధవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న పనులు, ఆయా శాఖలకు కేటాయించిన స్థలాలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా పారిశ్రామికవాడలోని సర్వే నంబర్ 1291,5లో వివిధ శాఖల నిర్మాణాల కోసం కేటాయించిన ఎకరం 80 సెంట్ల స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. మ్యాప్ ఆధారంగా స్థల వివరాలను పరిశీలించి, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నిర్మాణాల ప్రణాళికపై అధికారులతో చర్చించారు. అనంతరం సీబీజెడ్ చర్చి ప్రాంగణంలో ఎంపీ ల్యాడ్స్ నిధులతో 10 లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ పనులను పరిశీలించారు. నిర్మాణం దాదాపు 90 శాతం పూర్తయిందని అధికారులు వివరించగా, మిగిలిన పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేసి ఈ నెలాఖరులోగా అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. హాల్‌లో అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. రైల్వే స్టేషన్ రోడ్డులోని పొట్టి శ్రీరాములు ఏరియా ఆసుపత్రిలో 25 లక్షల రూపాయల ఎంపీ ల్యాడ్స్ నిధులతో చేపడుతున్న వెయిటింగ్ హాల్, ఆర్ఓ ప్లాంట్ పనులను కూడా కలెక్టర్ పరిశీలించారు. రోగుల సహాయకులకు ఉపయోగపడే ఈ సదుపాయాలను డిసెంబర్ 15, 2026 నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. నిర్మాణంలో నాణ్యత విషయంలో రాజీ పడొద్దని అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో డీపీఎచ్ఈఓ సాయి మహేష్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి విజయమ్మ, బాపట్ల ఆర్డీఓ హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వివాహేతర సంబంధం నేపథ్యంలో యువకుడి హత్య అనుమానాస్పద మృతిగా నమోదైన కేసును హత్య కేసుగా మార్పు నిందితుడి అరెస్ట్.



**ఆలమూరు అక్టోబర్ 7(ప్రజాజ్యోతి):**గత సెప్టెంబర్ నెల చివరలో మడికి గ్రామంలో జరిగిన హత్య కేసుకి సంబంధించి బుధవారం ఉదయం ఆలమూరు పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రావులపాలెం రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్ విద్యాసాగర్,ఆలమూరు ఎస్సై జి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మడికి గ్రామ శివారులోని కార్తికేయ నర్సరీలో యువకుడి అనుమానాస్పద మృతి కేసును పోలీసులు హత్య కేసుగా మార్చి నిందితుడిని అరెస్ట్ చేశారు. హత్యకు దారితీసిన పరిస్థితులు పోలీసు అధికారులు మీడియాకు తెలియజేసిన వివరాల ప్రకారం.. మడికి గ్రామ పరిధిలోని చిలకలపాడుకు చెందిన మింగి రమేష్ (24) నర్సరీలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గత సెప్టెంబర్ నెల 29 తేది అర్ధరాత్రి,30వ తేదీ తెల్లవారుజామున మడికి గ్రామ శివారులోని కార్తికేయ నర్సరీలో రమేష్ మృతదేహం లభించడంతో తొలుత అనుమానాస్పద మృతిగా ఆలమూరు పోలీసులు కేసు (క్రైమ్ నెంబర్ 141/26)నమోదు చేశారు. డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, ఐపీఎస్ వారి పర్యవేక్షణలో కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్ ఆధ్వర్యంలో రావులపాలెం రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్ విద్యాసాగర్ కేసు దర్యాప్తు చేపట్టారు. ఫోరెన్సిక్, క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ సహకారంతో ఆధారాలను సేకరించి, పలువురు సాక్షులను విచారించారు. దర్యాప్తులో లభించిన ఆధారాల ఆధారంగా అక్టోబర్ 5న కేసును హత్య కేసుగా మార్చారు.

**భార్యతో వివాహేతర సంబంధం కారణంగానే హత్య**

పోలీసుల కథనం ప్రకారం.. మృతుడు రమేష్‌కు వివాహం కాలేదు. మడికి గ్రామానికి చెందిన గంపా దుర్గాప్రసాద్, అనూష లు 2021 లో ప్రేమ వివాహం చేసుకున్నారు. గంపా దుర్గాప్రసాద్ భార్య గంపా అనూషతో రమేష్‌కు కొంతకాలంగా వివాహేతర సంబంధం ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ విషయమై దుర్గాప్రసాద్, అనూష మధ్య తరచూ గొడవలు జరిగేవి. దీంతో అనూష గత ఆరు నెలలుగా తన తల్లి ఇంటికి సమీపంలో ఓ పెంకుటిల్లును అద్దెకు తీసుకుని తన ఐదేళ్ల కుమార్తెతో కలిసి ఉంటోంది. రమేష్ తరచూ అనూషతో ఫోన్‌లో మాట్లాడటం, ఆమె అద్దె ఇంటికి వచ్చి వెళ్తుండటాన్ని గమనించిన దుర్గాప్రసాద్ రమేష్‌పై కక్ష పెంచుకున్నట్లు పోలీసులు తెలిపారు. సెప్టెంబర్ 29 రాత్రి రమేష్ తన తెలుపు రంగు స్కూటీని అనూష అద్దెకు ఉంటున్న ఇంటి వెనుక ఉన్న కార్తికేయ నర్సరీలో ఉంచి ఆమె ఇంటికి వెళ్లాడు. ఈ విషయాన్ని గమనించిన దుర్గాప్రసాద్ స్కూటీ వద్దకు రమేష్ తిరిగి వచ్చే వరకు కాపు కాశాడు. అర్ధరాత్రి సుమారు 1.15 గంటల సమయంలో రమేష్ అనూష ఇంటి నుంచి నర్సరీలోని తన స్కూటీ వద్దకు రాగా దుర్గాప్రసాద్ అతనితో గొడవకు దిగినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం రమేష్ మెడలోని పూసల దండతో అతని గొంతును నొక్కి, తన వద్ద ఉన్న కత్తితో పొట్టలో పొడిచినట్లు పేర్కొన్నారు. రమేష్ కిందపడిపోవడంతో దుర్గాప్రసాద్ అతని గుండెలపై కూర్చొని ముఖంపై పిడిగుద్దులు గుద్ది, గొంతు నొక్కి హత్య చేసినట్లు దర్యాప్తులో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు.

**నిందితుడి అరెస్ట్**

ఈ కేసులో నిందితుడైన మడికి గ్రామం రావిచెట్టు వీధికి చెందిన గంపా దుర్గాప్రసాద్ (26)ను అక్టోబర్ 6న సాయంత్రం 5 గంటల సమయంలో మడికి గ్రామంలో పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం ముద్దాయిని న్యాయస్థానంలో హాజరుపరచగా, న్యాయస్థానం 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. దీంతో ముద్దాయిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు. కాగా మృతుడు రమేష్, నిందితుడు దుర్గాప్రసాద్, దుర్గాప్రసాద్ భార్య అనూషతో పాటు మరికొందరికి సంబంధించిన సెల్‌ఫోన్ కాల్ డేటాను పోలీసులు పరిశీలించాల్సి ఉంది. ఈ ఘటనలో మరెవరైనా పాత్ర ఉందా అనే కోణంలోనూ దర్యాప్తు కొనసాగుతోంది.

**పోలీసు బృందానికి జిల్లా ఎస్పీ అభినందనలు**

కేసును వేగంగా దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్ట్ చేయడంలో కీలక పాత్ర పోషించిన కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్, రావులపాలెం రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్ విద్యాసాగర్, ఆలమూరు ఎస్ఐ జి. నరేష్, ఏఎస్ఐ డి. స్వామి, హెడ్ కానిస్టేబుల్ కె. అమ్మిరాజు, పోలీస్ కానిస్టేబుళ్లు పి. రాజు, జి. శ్రీను, ఎం. హనుమంత్ రాము, ఇతర పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, ఐపీఎస్ వారు ప్రత్యేకంగా అభినందించారు.

# మిట్టమీదపల్లి చెరువులో నిర్మాణ వ్యర్థాలు.. అధికారుల నిర్లక్ష్యమే ముఖ్య కారణం

**హిందూపురం: ప్రజా జ్యోతి న్యూస్ :** అక్టోబర్ 6: శ్రీ సత్య సాయి జిల్లా బ్యూరో అంజి:మీదపల్లి చెరువులో నిర్మాణ వ్యర్థాలు అధికారుల నిర్లక్ష్యంప్లాస్టిక్ వ్యర్థాలు నిర్మాణ సామగ్రి చెరువు పరిసరాల్లో కనిపిస్తున్నాయంటున్న స్థానికులు మిట్టమీదపల్లి గ్రామంలోని చెరువు పరిసర ప్రాంతంలో నిర్మాణ పనులకు సంబంధించిన వ్యర్థాలు ప్లాస్టిక్ పదార్థాలు కనిపిస్తున్నాయంటూ స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారు. గృహ నిర్మాణాల నుంచి వెలువడుతున్న వ్యర్థాలు చెరువు పరిసరాల్లోకి చేరుతున్నాయా లేదా ఇతర ప్రాంతాల నుంచి వచ్చి అక్కడ పేరుకుపోతున్నాయా అనే విషయంపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. చెరువు పరిసరాల్లో మట్టి ఇటుక ముక్కలు నిర్మాణానికి సంబంధించిన ఇతర అవశేషాలతో పాటు ప్లాస్టిక్ కవర్లు బాటిళ్లు వంటి వ్యర్థాలు కనిపిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు వీటిలో కొన్ని నిర్మాణ పనుల నుంచి వచ్చినవిగా కనిపిస్తున్నప్పటికీ వాటి మూలం ఏమిటన్నది అధికారుల పరిశీలన తర్వాతే స్పష్టమవుతుందని స్థానికులు పేర్కొంటున్నారు చెరువు నీటి వనరుగా ఉపయోగపడుతున్న నేపథ్యంలో పరిసర ప్రాంతాల్లో వ్యర్థాలు పేరుకుపోవడం వల్ల భవిష్యత్తులో పారిశుద్ధ్య పర్యావరణ సమస్యలు ఏర్పడే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా ప్లాస్టిక్ వ్యర్థాలు నీటిలోకి చేరకుండా ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వారు కోరుతున్నారు.



క్షేత్రస్థాయి పరిశీలన అవసరం చెరువు ప్రస్తుత పరిస్థితిపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి వ్యర్థాలు ఎక్కడి నుంచి వస్తున్నాయనే అంశాన్ని గుర్తించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. చెరువు పరిధిలో నిర్మాణ వ్యర్థాలు వేయడానికి అనుమతులు ఉన్నాయా? లేక నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వ్యర్థాలను తరలిస్తున్నారా? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉందని వారు అంటున్నారు. అదేవిధంగా చెరువు పరిసరాల్లో ఇప్పటికే పేరుకుపోయిన ప్లాస్టిక్ ఇతర చెత్తను తొలగించి భవిష్యత్తులో వ్యర్థాలు వేయకుండా పర్యవేక్షణ పెంచాలని గ్రామస్థులు కోరుతున్నారు. అవసరమైతే చెరువు పరిసర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు వ్యర్థాల నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించాలని మిట్టమీద పల్లి గ్రామ ప్రజలు సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు

# ప్రజా సేవకు శంకరన్ జీవితం ఆదర్శం

**జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్**

**బాపట్ల అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** ప్రజా సేవకు జీవితాన్ని అంకితం చేసిన విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎస్.ఆర్. శంకరన్ సేవలు నేటి అధికారులకు, యువతకు ఆదర్శప్రాయమని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ వాసుదేవ అన్నారు. శంకరన్ 16వ వర్ధంతిని పురస్కరించుకుని బుధ వారం బాపట్ల కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన శంకరన్ విగ్రహానికి పుష్పమాలలు వేసి నివాళులర్పించారు. పేదలు, ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం శంకరన్ చేసిన కృషిని కలెక్టర్ గుర్తుచేశారు. నెల్లూరులో సంయుక్త కలెక్టర్‌గా పనిచేసిన సమయంలో నిరుపేదలను సొసైటీలుగా ఏర్పాటు చేసి వందల ఎకరాల భూమిని పంపిణీ చేయడంతో పాటు, చీరాలలోనూ 300 ఎకరాల అసైన్డ్ భూమిని పేదలకు అందించడంలో కీలకపాత్ర పోషించారని తెలిపారు. క్షేత్రస్థాయి అధికారి నుంచి రాష్ట్రస్థాయి కార్యదర్శి వరకు ఏ బాధ్యతలో ఉన్నా ప్రజా సంక్షేమానికే ప్రాధాన్యం ఇచ్చారని కొనియాడారు.



శంకరన్ ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నానని కలెక్టర్ తెలిపారు. బాపట్ల కలెక్టరేట్‌లో ఆయన పేరుతో సమావేశ మందిరం, సెమినార్ హాల్, పీజీఆర్ఎస్ హాల్, స్టడీ రూమ్, స్టడీ సెంటర్ వంటి వాటిని ఏర్పాటు చేయడం ఆయన సేవలకు లభించిన గౌరవానికి నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు కలెక్టర్ బహుమతులు అందజేశారు. బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని డి.పావని ప్రథమ బహుమతి, రాజేష్ దాసు, ఫుడ్ సైన్స్ కళాశాల విద్యార్థిని ఎం.నికిత, వ్యవసా య ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని ఏ.కవిత ద్వితీయ బహుమతులు అందుకున్నారు. అనంతరం మన్నె శ్రీనివాసరావు రచించిన రేపల్లె చరిత్ర పుస్తకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డా. పి.సి. సాయిబాబు మాట్లాడుతూ శంకరన్‌ను నిరుపేదల కలెక్టర్ గా అభివర్ణించారు. పరిపాలనను ప్రజల వద్దకు తీసుకెళ్లిన ఆయన సేవలు సుపరిపాలనకు మార్గదర్శకంగా నిలి చాయని పేర్కొన్నారు. 2023 అక్టోబర్ 7న బాపట్ల కలెక్టరేట్ ఆవరణలో శంకరన్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో మల్లికార్జున్, ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ప్రతినిధులు ఉమారెడ్డి వెంకట రామారావు, చిల్లర భవానీదేవి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు బి.ఎస్. నారాయణభట్టు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చెవిపోగు చోరీ - నిందితుడికి జైలు

## 24 గంటల్లో అరెస్ట్. నాలుగు నెలల్లో శిక్ష






**బాపట్ల అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** నేరస్తులకు చట్టప్రకారం శిక్ష పడేలా దర్యాప్తు, కోర్టు ట్రయల్స్‌ను సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్, ఐపీఎస్ తెలిపారు. చందోలు గ్రామంలో మహిళ చెవిపోగు లాక్కున్న కేసును వేగంగా దర్యాప్తు చేసి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామ పరిధిలో జూన్ 7న పొలంలో పశువులను మేపుకుంటున్న మహిళ వద్దకు వచ్చిన నిందితుడు పొట్లూరి అనోక్ అలియాస్ అనిఫ్ (30) ఆమె చెవికి ఉన్న బంగారు చెవిపోగును బలవంతంగా లాక్కున్నాడు. మరో చెవిపోగును కూడా లాక్కునేందుకు ప్రయత్నించగా బాధితురాలు కేకలు వేయడంతో సమీపంలోని వారు అక్కడికి చేరుకున్నారు. దీంతో నిందితుడు ఆమెను తోసివేసి పరారయ్యాడు.బాధితురాలి ఫిర్యాదుతో చందోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎస్సై కె. మాధవరావు నిందితుడిని నేరం జరిగిన 24 గంటల్లోనే అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అనంతరం ఆధారాలను సేకరించి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. దీంతో కేసు నమోదైన నాలుగు నెలల్లోనే విచారణ పూర్తయి నిందితుడికి శిక్ష పడింది.బాపట్ల అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నిందితుడికి ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధించింది. జరిమానా చెల్లించని పక్షంలో మరో నెల జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి జీ. రేణుకలత తీర్పు ఇచ్చారు.కేసులో సమర్థవంతంగా వాదనలు వినిపించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి. రవీంద్రకుమార్, కోర్టు ట్రయల్‌లో సహకరించిన కానిస్టేబుల్ ఎం. వేంకటేశ్వరరావు సేవలను కూడా ఎస్పీ అభినందించారు.

# మానవత్వమే ఊపిరిగా... దేశం దాటిన సేవా ప్రస్థానం!

**ప్లాస్టిక్ సామాన్లు అమ్ముకుంటూ జీవనం.. రోడ్డు పక్కనే నివాసం**
**"రోడ్డు పక్కన జీవనం.. దేశం దాటిన మానవత్వం!"**
**26 ఏళ్లుగా బాటసారులకు చల్లని నీరు.. పశుపక్ష్యాదులకు ఆహారం, నీరు**
**అనాథ శవాలకు దహన సంస్కారాల్లో అండగా.. ఎన్నో అవార్డులు, రివార్డులు**
**ఇప్పుడు మలేషియాకు సైతం విస్తరించిన అనపాల ఆంజనేయరెడ్డి సేవలు**



**కాకినాడ జిల్లా అక్టోబర్ 07(ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్** సేవ చేయాలంటే ఆస్తులు ఉండాల్సిన అవసరం లేదు.. అందుకు కావాల్సింది కేవలం మంచి మనసు, మానవత్వం, సేవా సంకల్పం మాత్రమే. తన జీవితం ఎన్నో కష్టాలతో సాగుతున్నప్పటికీ.. తనకున్నంతలో సమాజానికి ఏదో ఒకటి చేయాలనే తపనతో గత 26 ఏళ్లుగా నిరంతర సామాజిక సేవ చేస్తున్న వ్యక్తి అనపాల ఆంజనేయరెడ్డి. కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేట పంచాయతీ పరిధిలో రోడ్డు పక్కన నివాసం ఉంటూ ప్లాస్టిక్ సామాన్లు విక్రయించుకుంటూ జీవనం సాగిస్తున్న ఆంజనేయరెడ్డి.. తన జీవన పరిస్థితులను చూసి వెనక్కి తగ్గలేదు. తన సంపాదనలో కొంత భాగాన్ని ప్రజా సేవకు వినియోగిస్తూ మానవత్వానికి మరో రూపంగా నిలుస్తున్నారు. దాహార్తిని తీర్చేందుకు ఫిల్టర్ వాటర్ రహదారులపై ప్రయాణించే బాటసారులు, పాదచారులు దాహంతో ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఫిల్టర్ వాటర్‌ను ఏర్పాటు చేసి నిత్యం మంచినీటిని అందిస్తున్నారు. మండుటెండల్లో సైతం ఎవరైనా వచ్చి దాహం తీర్చుకునేలా నీటి సౌకర్యాన్ని కొనసాగిస్తున్నారు. మూగజీవుల ఆకలి.. దాహం తీర్చే ఆపన్నహస్తం మనుషులకే కాదు.. మూగజీవులపైనా ఆయనకు అపారమైన ప్రేమ. పశువులు, పక్షులు నీటి కోసం, ఆహారం కోసం ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో వాటికి నీరు, తిండి అందించే ఏర్పాట్లు చేస్తున్నారు. ఎండాకాలంలో పశు పక్ష్యాదులకు నీటి కొరత లేకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. అనాథ శవాలకు అంతిమ గౌరవం కుటుంబ సభ్యులు లేక, దిక్కుతోచని స్థితిలో ఉన్న అనాథ శవాలకు సైతం ఆయన అండగా నిలుస్తున్నారు. అనాథ శవాలకు దహన సంస్కారాలు నిర్వహించేందుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ.. చివరి మజిలీలోనూ మానవత్వాన్ని చాటుతున్నారు. జీవించి ఉన్నవారికి సహాయం చేయడమే కాదు.. మరణించిన వారికి గౌరవప్రదమైన అంతిమ సంస్కారాలు జరిగేలా చూడటం ఆయన సేవా కార్యక్రమాల్లో ప్రత్యేకతగా నిలుస్తోంది. 26 ఏళ్ల సేవకు ఎన్నో అవార్డులు ఎటువంటి ప్రతిఫలం ఆశించకుండా, ప్రచారం కోసం కాకుండా సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్న ఆంజనేయరెడ్డి.. గత 26 ఏళ్ల సుదీర్ఘ సేవా ప్రస్థానంలో ఎన్నో అవార్డులు, రివార్డులు, ప్రశంసలు అందుకున్నారు. అయినప్పటికీ అవార్డుల కోసం కాకుండా.. ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే తన లక్ష్యమని ఆయన సేవా ప్రయాణం చెబుతోంది.సరిహద్దులు దాటి.. మలేషియాకు చేరిన సేవ స్థానికంగా ప్రారంభమైన ఆంజనేయరెడ్డి సేవా ప్రస్థానం ఇప్పుడు దేశ సరిహద్దులు దాటి మలేషియా వరకు చేరడం విశేషంగా మారింది. ఆయన సేవా కార్యక్రమాలకు విదేశాల్లోనూ గుర్తింపు లభించడం.. ఆయన 26 ఏళ్ల సేవా ప్రస్థానానికి దక్కిన గౌరవంగా పలువురు అభివర్ణిస్తున్నారు సేవకు సంపద కాదు.. సంకల్పమే కావాలి సాధారణ జీవితం గడుపుతూ.. రోడ్డు పక్కన నివాసం ఉంటూ.. ప్లాస్టిక్ సామాన్లు విక్రయించుకుంటూ జీవనం సాగించే వ్యక్తి తనకున్న కొద్దిపాటి ఆదాయంతోనే వేలాది మందికి, మూగజీవులకు, అనాథలకు అండగా నిలవడం అందరికీ స్ఫూర్తిదాయకం. "సేవ చేయడానికి మన దగ్గర ఎంత ఉంది అన్నది కాదు.. మనసులో ఎంత మానవత్వం ఉందన్నదే ముఖ్యం" అన్న సందేశాన్ని తన 26 ఏళ్ల సేవా ప్రస్థానం ద్వారా ఆంజనేయరెడ్డి చాటిచెబుతున్నారు. స్థానికంగా మొదలైన ఈ సేవా ప్రయాణం ఇప్పుడు మలేషియా వరకు విస్తరించడం ద్వారా ఆయన మానవత్వానికి సరిహద్దులు లేవని నిరూపిస్తున్నారు..

# ప్రతి ఒక్క విద్యార్థి ఏదొక క్రీడలో రాణించాలి యువ నాయకులు సతీష్ నాయుడు

**రాష్ట్ర,జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొని రావాలి...కౌతాళం సింగిల్ విండో అధ్యక్షులు వెంకటపతిరాజు**

**కౌతాళం,అక్టోబర్ 07 ప్రజా జ్యోతి** మంగళవారం రోజున కౌతాళం మండలం మండల కేంద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు విద్యార్థులకు అభినందనలు తెలియజేస్తూ నియోజక వర్గ స్థాయి నుండి జిల్లా స్థాయిలో కబడ్డీ పోటీలకు ఎన్నిక అయిన అయిన విద్యార్థుల అభినందన సభలో పాల్గొనడం జరిగినది.ప్రతి విద్యార్థి మీకు నచ్చిన ఒక క్రీడలో రాణించి మీ శారీరక,మానసిక ఆరోగ్యం గట్టిపరిస్తూ మీరూ చదువుకుంటున్న పాఠశాల,మీ గ్రామానికి,మండల, నియోజకవర్గ రాష్ట్ర మరియు దేశానికి పేరు తీసుకొని రావాలని సూచిస్తూ,క్రీడలకు మరియు చదువు పట్ల ఎవరికి ఎలాంటి ఇబ్బందులు వచ్చినా మీ శ్రేయోభిలాషి మేము మా కూటమి ప్రభుత్వ నాయకులు సహాయసహకారాలు అందిస్తామని తెలియజేశారు.ఈ కార్యక్రమములో పట్టణ అధ్యక్షులు డా" రాజనందు,రమేష్, నభిసాబ్, చిన్న ఈరన్న, శ్రీనివాసులు, నాగరాజు,మైబు మరియు శ్రీరాములు మొదలగు వారు పాల్గొనడం జరిగినది.అనంతరం తెదేపా పార్టీ కార్యాలయం నందు జరిగిన యూనిట్ ఇంచార్జీలు సమావేశం నందు పాల్గొని తెదేపా సంక్షేమ అభివృద్ధి ప్రజలకు తెలియజేయాలని,మండల గ్రామాల నందు ప్రధాన సమస్యలను తీర్మాన రూపంలో రాసి పార్టీ దృష్టికి తీసుకెళ్ళేల మై టిడిపి యాప్ నందు వివరాలు నమోదు చెయ్యడం జరిగినది.



## మా కాలనీలు మాకె కేటాయించాలి : పడమట మెట్ట గ్రామస్తులు

**వేలేరుపాడు : 07 అక్టోబర్ వేలేరుపాడు : ప్రజాజ్యోతి రిపోర్టర్ (శివరామ్ )** బుధవారం రోజున జీలుగుమిల్లి మండలం దర్భగూడెం పంచాయతీ పరిధి లో పడమటి మెట్ట గ్రామస్తులకు 2018 వ సంవత్సరంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం కేటాయించిన ఆర్ అండ్ ఆర్ ఇళ్లను చింతూరు మండలం ఉలుమురు గ్రామస్తులకు కేటాయించడం జరిగింది,పడమటి మెట్ట గ్రామస్తులకు కేటాయించిన ఇళ్లను తిరిగి పడమటి మెట్ట గ్రామానికే ఇవ్వాలి అని చింతూరు మండల తహసీల్దార్ కి పడమటి మెట్ట గ్రామస్తులుకి కేటాయించాలి అని వినతి పత్రం ఇవ్వడం జరిగింది, గమనార్హం ఏమిటంటే పడమటి మెట్ట గ్రామం 45 వ కాంటూరులో ఉండటం, ప్రభుత్వం మాత్రం కేవలం మొదట 41 వ కాంటూరులోకి వచ్చే నిర్వాసితులకు మాత్రమే పరిహారం కానీ వాళ్ళను ఆర్ అండ్ ఆర్ ఇళ్లకు తరలించే పనిలో ఉంది.



## విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంక్ ద్వితీయ వార్షికోత్సవం



**బాపట్ల అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** బాపట్ల పట్టణంలోని ది విశాఖ కో,ఆపరేటివ్ బ్యాంక్ శాఖ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. బ్రాంచ్ కమిటీ సభ్యులు గురజాల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ ఏ. అర్జున్ రావు మాట్లాడుతూ ఖాతాదారుల సహకారంతో శాఖ రెండేళ్లలో మంచి ప్రగతి సాధించిందన్నారు. బడుగు, బలహీన వర్గాలకు తక్కువ వడ్డీకే రుణాలు, విద్యార్థులకు విద్యా రుణాలు అందిస్తున్నామని తెలిపారు.ఈ సందర్భంగా స్టేట్ లెవెల్ జూనియర్ నేషనల్ అథ్లెటిక్స్ మీట్‌కు ఎంపికైన మరుప్రోలువారిపాలెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు ఆస్వాది బ్రహ్మశ్రీ, నిద్ర గాయత్రీదేవి, జంగా స్మైలీలను సత్కరించి ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. వారికి శిక్షణనిచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు బడుగు లక్ష్మీనారాయణ, అద్దంకి మాలతి, గొల్లప్రోలు నాగ మారుతి కుమారిలను కూడా అభినందించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, బ్యాంక్ సిబ్బంది, ఖాతాదారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బద్వేల్‌లో ఘనంగా బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పవన్ కుమార్ జన్మదిన వేడుకలు



**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి)** బద్వేల్ పట్టణంలోని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) కార్యాలయం బుధవారం కోలాహలంగా మారింది. భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొలిశెట్టి పవన్ కుమార్ జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణులు, అభిమానులు ఇక్కడ అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేడుకల్లో పవన్ కుమార్ అభిమానులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేశారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు ఆయనకు పూలమాలలు వేసి, శాలువాలతో ఘనంగా సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. యువతను నడిపించడంలో మరియు పార్టీ బలోపేతానికి పవన్ కుమార్ అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ సీనియర్ నాయకులు, బీజేవైఎం ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు మరియు పవన్ కుమార్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

## ములకలపెంట గ్రామీణ రోడ్లకు మహర్దశ




**గుంతకల్లు అక్టోబర్ 6 (ప్రజా జ్యోతి):** పల్లె పండుగ 3.0లో భాగంగా ములకలపెంట గ్రామీణ రోడ్లకు మహర్దశ పట్టనుం దని గుంతకల్లు మండలం టిడిపి ఇన్చార్జి గుమ్మనూరు నారాయణ స్వామి అన్నారు. వి.బి జి రామ్ జి నిధులతో రూ:10 లక్షల అంచనా వ్యయంతో గుంతకల్లు మండలాల్లోని ములకలపెంట గ్రామంలో నూతన సిసి రోడ్ల నిర్మాణా పనులకు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఆదేశాల మేరకు ఆయన సోదరుడు గుంతకల్లు టిడిపి మండల ఇన్చార్జి గుమ్మనూరు నారాయణ స్వామి బుధవారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా గుమ్మనూరు నారాయణస్వామి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, గుంతకల్లు నియోజకవర్గం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సహకారంతో గుంతకల్లు నియోజకవర్గం లో పలు అభివృద్ధి పనులు కొనసాగు తున్నాయని, అందులో భాగంగానే ములకలపెంట గ్రామంలో ఇప్పటికే సుమారు రూ:60 లక్షల తో అభివృద్ధి పనులు చేపట్టను న్నట్లు తెలిపారు. గతంలో రూ:10 లక్షల తో సిసి రోడ్లు నిర్మాణం పూర్తి చేయగా, తాజాగా మరో రూ:10 పదిలక్షలతో కొత్త సిసి రోడ్లు నిర్మాణానికి బుధవారం భూమి పూజ చేసినట్లు గుమ్మనూరు నారాయణ స్వామి వివరించారు. అదేవిధంగా సగంలోనే నిలిచిపోయి శిథిలావస్థకు చేరుకున్న గ్రామ పాఠశాల అభివృద్ధికి రూ.32 లక్షలు కేటాయించి, అవసరమైన మౌలిక వసతులు కల్పించే పనులను ప్రారంభించినట్లు తెలిపారు. గ్రామంలో తాగు నీటి బోర్‌లైన్ కోసం కూడా రూ.8 లక్షలు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మార్గదర్శకత్వంలో, గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సహకారంతో సంక్షేమంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని నారాయణస్వామి తెలిపారు. అలాగే అమినపల్లి గ్రామం నుంచి ములకలపెంట గ్రామానికి తారు రోడ్డు నిర్మాణానికి కూడా మంజూరు లభించిందని ఆయన వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, విద్య, డ్రైనేజీ వంటి మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు అభివృద్ధి పనులను దశలవారీగా చేపడుతు న్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కౌతాళాన్ని కరువు మండలంగా ప్రకటించాలి







## :-వైఎస్సార్‌సీపీ, వామపక్షాల నిరవధిక నిరాహార దీక్ష విజయవంతం

**కౌతాళం,అక్టోబర్ 07 ప్రజా జ్యోతి** కౌతాళం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలనే డిమాండ్‌తో బుధవారం 07-10-2026 చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష విజయవంతమైంది మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగి రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ,వామపక్షాల సిపిఎం,మరియు రైతు కూలీ సంఘం నాయకుల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని రైతాంగ సమస్యలను పరిష్కరించాలని, కౌతాళంను వెంటనే కరువు మండలంగా ప్రకటించి ప్రభుత్వం ఆదుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు.

**భారీగా పాల్గొన్న నాయకులు, ప్రజాప్రతినిధులు:**

ఈ దీక్షా కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మరియు వామపక్షాల ప్రముఖ నాయకులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.పాల్గొన్న వారిలో ముఖ్య నాయకులు పిఏ వెంకటరామరెడ్డి, ఏకం రెడ్డి,వైస్ ఎంపీపీ బుజ్జి స్వామి,మాజీ సర్పంచులు అవతారం పాల్ దినాకర్,సిపిఎం ప్రతినిధులు మల్లయ్య,ఈరన్న, మారెప్ప,ఎరిగేరి వీరేష్,రైతు కూలీ సంఘం నాయకులు జగదీష్, నాగేంద్రప్ప,మా భాష, వీరన్న,రమేష్, లింగన్న,వీరేష్.ఇతర ప్రముఖులు వైసీపీ మండల వైస్ ప్రెసిడెంట్ రౌడూరు ఆర్ ఎం.సుధాకర్ రెడ్డి,వడ్డే రాముడు, సక్రి తిక్కయ్య,ఉప్పరహాల్ పెద్ద లింగన్న,రామ్ గోవిందప్ప బారికి లక్ష్మణ్,రాందాస్ రెడ్డి, పరమేష్,బాపురం జైపాల్,సులేకేరి ఆదిరెడ్డి,చూడి రమేష్,నాగరాజు, ఉచ్చప్ప,తాయన్న, వీరభద్ర గౌడ్, చిరతపల్లి నర్సింహులు, కుంబులూరు అనిల్, బదేనేహాల్ మౌలా, ఖాదర్ బాషా, వెంకటేష్,కౌతాళం వడ్డే రాముడు,సక్రి తిక్కయ్య, వెంకటరామరాజు, అబ్దుల్ సమ్మద్, హనుమంత్ రెడ్డి, లింగారెడ్డి,డింగి రామకృష్ణ,బెస్త నారాయణ,బెస్త మర్రిస్వామి తాహర్ వలి,వడ్డే అంజి,జీడి. ఖదిర్ దేశాయ్, యూత్ సభ్యులు, ఎంపిటిసి ముకన్న తదితరులు ఉన్నారు.వీరితో పాటు కౌతాళం మండలంలోని గౌరవనీయ మండల నాయకులు, ఎంపిటిసిలు, సర్పంచులు, వైఎస్సార్‌సీపీ, సిపిఎం,రైతు కూలీ సంఘాల గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు,మరియు మండల పరిధిలోని రైతులు, అభిమానులు అత్యధిక సంఖ్యలో పాల్గొని ఈ నిరసన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున విజయవంతం చేశారు.ప్రభుత్వం స్పందించి కౌతాళం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించే వరకు తమ పోరాటం ఆగదని ఈ సందర్భంగా నాయకులు స్పష్టం చేశారు.

# విద్యార్థిని ఫిర్యాదుపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలి

## హెడ్మాస్టర్, ఎంఈఓపై పూర్తిస్థాయి విచారణ జరపాలి సిపిఐ




**గాలివీడు అక్టోబర్ 07 ప్రజా జ్యోతి** వెలిగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థినితో ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు అసభ్యకరంగా ప్రవర్తించాడన్న ఆరోపణలపై ఆయనకు మద్దతు పలికిన ఎంఈఓ నాగరాజు, హెడ్మాస్టర్ సుబ్రహ్మణ్యంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు డిమాండ్ చేశారు.బుధవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు విద్యాబుద్ధులతో పాటు మంచి విలువలు నేర్పించాల్సిన ఉపాధ్యాయుడిపై విద్యార్థినితో అసభ్యకరంగా వాట్సాప్‌లో చాటింగ్ చేయడం, ఫోన్‌లో మాట్లాడటం వంటి ఆరోపణలు రావడం ఆందోళనకరమన్నారు. ఈ వ్యవహారంపై విద్యార్థిని తల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఎంఈఓకు ఫిర్యాదు చేసినప్పటికీ తగిన స్థాయిలో స్పందించలేదని ఆరోపించారు. విద్యార్థిని భద్రత, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఫిర్యాదును వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమగ్ర విచారణ చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఫిర్యాదుపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు విచారణలో తేలితే హెడ్మాస్టర్, ఎంఈఓపై కూడా శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.విద్యార్థినితో అసభ్యకరంగా ప్రవర్తించాడన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు ఇప్పటికే సస్పెండ్ అయ్యారని, అయితే ఫిర్యాదుపై నిర్లక్ష్యంగా వ్యవహరించి నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న హెడ్మాస్టర్, ఎంఈఓలపై కూడా పూర్తిస్థాయి విచారణ జరిపించాలని కోరారు. ఆరోపణలు నిజమని తేలితే చట్టపరమైన, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో విద్యార్థులకు సురక్షితమైన వాతావరణం కల్పించేందుకు విద్యాశాఖ అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో సిపిఐ నాయకులు చుక్క జగన్‌బాబు, పి. ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వమే ఊపిరిగా... దేశం దాటిన సేవా ప్రస్థానం!

**ప్లాస్టిక్ సామాన్లు అమ్ముకుంటూ జీవనం.. రోడ్డు పక్కనే నివాసం**
**"రోడ్డు పక్కన జీవనం.. దేశం దాటిన మానవత్వం!"**
**26 ఏళ్లుగా బాటసారులకు చల్లని నీరు.. పశుపక్ష్యాదులకు ఆహారం, నీరు**
**అనాథ శవాలకు దహన సంస్కారాల్లో అండగా.. ఎన్నో అవార్డులు, రివార్డులు**
**ఇప్పుడు మలేషియాకు సైతం విస్తరించిన అనపాల ఆంజనేయరెడ్డి సేవలు**



**కాకినాడ రూరల్ (ప్రజా జ్యోతి)** సేవ చేయాలంటే ఆస్తులు ఉండాల్సిన అవసరం లేదు.. అందుకు కావాల్సింది కేవలం మంచి మనసు, మానవత్వం, సేవా సంకల్పం మాత్రమే. తన జీవితం ఎన్నో కష్టాలతో సాగుతున్నప్పటికీ.. తనకున్నంతలో సమాజానికి ఏదో ఒకటి చేయాలనే తపనతో గత 26 ఏళ్లుగా నిరంతర సామాజిక సేవ చేస్తున్న వ్యక్తి అనపాల ఆంజనేయరెడ్డి. కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేట పంచాయతీ పరిధిలో రోడ్డు పక్కన నివాసం ఉంటూ ప్లాస్టిక్ సామాన్లు విక్రయించుకుంటూ జీవనం సాగిస్తున్న ఆంజనేయ రెడ్డి.. తన జీవన పరిస్థితులను చూసి వెనక్కి తగ్గలేదు. తన సంపాదనలో కొంత భాగాన్ని ప్రజా సేవకు వినియోగిస్తూ మానవత్వానికి మరో రూపంగా నిలుస్తున్నారు. దాహార్తిని తీర్చేందుకు ఫిల్టర్ వాటర్ రహదారులపై ప్రయాణించే బాటసారులు, పాదచారులు దాహంతో ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఫిల్టర్ వాటర్‌ను ఏర్పాటు చేసి నిత్యం మంచినీటిని అందిస్తున్నారు. మండుటెండల్లో సైతం ఎవరైనా వచ్చి దాహం తీర్చుకునేలా నీటి సౌకర్యాన్ని కొనసాగిస్తున్నారు. మూగజీవుల ఆకలి.. దాహం తీర్చే ఆపన్నహస్తం మనుషులకే కాదు.. మూగజీవులపైనా ఆయనకు అపారమైన ప్రేమ. పశువులు, పక్షులు నీటి కోసం, ఆహారం కోసం ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో వాటికి నీరు, తిండి అందించే ఏర్పాట్లు చేస్తున్నారు. ఎండాకాలంలో పశుపక్ష్యాదుల కు నీటి కొరత లేకుండా ప్రత్యే క శ్రద్ధ తీసుకుంటున్నారు. అనాథ శవాలకు అంతిమ గౌరవం కుటుంబ సభ్యులు లేక, దిక్కుతోచని స్థితిలో ఉన్న అనాథ శవాలకు సైతం ఆయన అండగా నిలుస్తున్నారు. అనాథ శవా లకు దహన సంస్కారాలు నిర్వహించేందుకు తన వంతు సహా య సహకారాలు అందిస్తూ.. చివరి మజిలీలోనూ మానవత్వా న్ని చాటుతున్నారు జీవించి ఉన్నవారికి సహాయం చేయడమే కాదు.. మరణించిన వారికి గౌరవప్రదమైన అంతిమ సంస్కారాలు జరిగేలా చూడటం ఆయన సేవా కార్యక్రమాల్లో ప్రత్యేకతగా నిలుస్తోంది. 26 ఏళ్ల సేవకు ఎన్నో అవార్డులు ఎటువంటి ప్రతిఫలం ఆశించకుండా, ప్రచారం కోసం కాకుండా సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్న ఆంజనేయ రెడ్డి.. గత 26 ఏళ్ల సుదీర్ఘ సేవా ప్రస్థానంలో ఎన్నో అవార్డులు రివార్డులు, ప్రశంసలు అందుకున్నారు. అయినప్పటికీ అవార్డుల కోసం కాకుండా.. ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే తన లక్ష్యమని ఆయన సేవా ప్రయాణం చెబుతోంది. సరిహద్దులు దాటి.. మలేషియాకు చేరిన సేవ స్థానికంగా ప్రారంభమైన ఆంజనేయరెడ్డి సేవా ప్రస్థానం ఇప్పుడు దేశ సరిహద్దులు దాటి మలేషియా వరకు చేరడం విశేషంగా మారింది. ఆయన సేవా కార్యక్రమాలకు విదేశాల్లో నూ గుర్తింపు లభించడం.. ఆయన 26 ఏళ్ల సేవా ప్రస్థానాని కి దక్కిన గౌరవంగా పలువురు అభివర్ణిస్తున్నారు. సేవకు సంపద కాదు.. సంకల్పమే కావాలి సాధారణ జీవితం గడుపు తూ.. రోడ్డు పక్కన నివాసం ఉంటూ.. ప్లాస్టిక్ సామాన్లు విక్రయించుకుంటూ జీవనం సాగించే వ్యక్తి తనకున్న కొద్దిపాటి ఆదాయంతోనే వేలాది మందికి, మూగజీవులకు, అనాథలకు అండగా నిలవడం అందరికీ స్ఫూర్తిదాయకం. "సేవ చేయడానికి మన దగ్గర ఎంత ఉంది అన్నది కాదు.. మనసులో ఎంత మానవత్వం ఉందన్నదే ముఖ్యం" అన్న సందేశాన్ని తన 26 ఏళ్ల సేవా ప్రస్థానం ద్వారా ఆంజనే యరెడ్డి చాటిచెబుతున్నారు. స్థానికంగా మొదలైన ఈ సేవా ప్రయాణం ఇప్పుడు మలేషియా వరకు విస్తరించడం ద్వారా ఆయన మానవత్వానికి సరిహద్దులు లేవని నిరూపిస్తున్నారు..

# ఆర్ ఎస్ రంగాపురం గ్రామ పంచాయతీ లో గుర్తింపు కార్డులను పంపిణీ చేసిన వైసీపీ నాయకులు



**బేతంచెర్ల:అక్టోబర్7(ప్రజా జ్యోతి)**రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని మండలసీనియర్ వైసిపి నాయకులు బుగ్గన చంద్రారెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ సిహెచ్ చలం రెడ్డి, మండల కన్వీనర్ కుంచా తిరుమలేశ్వర రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం బేతంచెర్ల మండల పరిధిలోని ఆర్ ఎస్ రంగాపురం, కొమ్మూరు కొట్టాల గ్రామల మాజీ సర్పంచ్ జగన్మోహన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సీతారామ చంద్రుడు, వైసీపీ నాయకుల ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలకు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాబోయే స్థానిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించేలా ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని కోరారు. స్థానిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలని కోరారు. కష్టపడి పనిచేసే ప్రతి నాయకుడు, కార్యకర్తకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని అన్నారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్యకర్తల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రమాద సమయంలో అండగా ఉండేందుకు రూ.5 లక్షల బీమా సౌకర్యాన్ని కల్పించారని తెలిపారు.కార్యక్రమంలో మద్దిలేటి స్వామి మాజీ చైర్మన్ సిహెచ్ లక్ష్మిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పుసులూరు మురళీకృష్ణ, కౌన్సిలర్ ఇబ్రహీం, వైసీపీ నాయకులు బుగ్గన కుమార్ రెడ్డి, సలీం, వలి భాషా, రియాజ్ మరియు ఆర్ ఎస్ రంగాపురం, కొమ్మూరు కొట్టాల గ్రామల వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నేషనల్ హైవే పనులను వెంటనే ప్రారంభించి ప్రజల ప్రాణాలను కాపాడాలని డిమాండ్ చేస్తూ వైకాపా రాస్తారోకో



**గుంతకల్లు అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి):** వైఎస్సార్‌సీపీ గుంతకల్లు నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు, ఇంచార్జ్ వై.వెంకటరామిరెడ్డి ఆదేశాల మేరకు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు వై.నైరుతి రెడ్డి ఆధ్వర్యంలో నేషనల్ హైవే పనులను వెంటనే ప్రారంభించి ప్రజల ప్రాణాలను కాపాడాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గుంతకల్లు పట్టణంలోని టీవీ స్టేషన్ వద్ద రాస్తారోకో నిర్వహించి హైవే దిగ్బంధం చేయటం జరిగింది. ఈ సందర్భంగా వైస్సార్సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు వై.నైరుతి రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నేషనల్ హైవే పనుల విషయంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. హైవే పనులు పూర్తికాకపోవడం తో రహదారులు ప్రమాదక రంగా మారాయని, ఒక నెల వ్యవధిలోనే రెండు ప్రమా దాలు చోటుచేసుకోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. ప్రజలు, వాహనదారులు ప్రతిరోజూ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించడం కాకుండా ముందుగానే రహదారి పనులను పూర్తి చేసి ప్రజల ప్రాణాలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. నేషనల్ హైవే పనులను తక్షణమే ప్రారంభించి, ప్రమాదాలు జరగకుండా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలో భారీ వాహనాలు తిరుగుతున్న సంబందించి న అధికారులు ట్రాఫిక్ నియంత్రణ చేయటంలో పూర్తిగా విఫలం చెందరు అన్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే వైఎస్సార్‌సీపీ ప్రజల తరపున మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతుం దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర, జిల్లా, నియోజక వర్గం, పట్టణ, మండలం, అనుబంధ విభాగల నాయకులు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు, పార్టీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

# పెద్దపాయ పంచాయతీని సందర్శించిన డీపీఓ




**ప్రజా జ్యోతి న్యూస్ ప్యాపిలి, అక్టోబరు 07** ప్యాపిలి మండల పరిధిలోని పెద్దపాయ గ్రామ పంచాయతీకి ఐఎస్ఓ సర్టిఫికెట్ దక్కిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా పెద్దపాయ పంచాయతీ సెంట్రల్ అవార్డుకు ఎంపికైన నేపథ్యంలో త్వరలో సెంట్రల్ కమిటీ సభ్యులు సందర్శించనున్నారు.ఈ నేపథ్యంలో నంద్యాల జిల్లా పంచాయతీ అధికారి ఆర్.ఈ.వి. ఫణికుమార్ నాయక్ బుధవారం పెద్దపాయ పంచాయతీని సందర్శించారు.అనంతరం ప్యాపిలిలోని ఎంపీడీఓ కార్యాలయంలో అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీఓ ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఆచంట అన్న క్యాంటీన్ లో ఆకలి కేకలు

**గంటక్షి నిండుకుంటున్న భోజన పదార్థాలు**
**నిర్వహణలోపమా? నిర్లక్ష్యమా? అంటున్న ప్రజలు**
**కూటమి ప్రభుత్వం ఏర్పాటును నాయకులు పట్టించుకోవడం విమర్శలకు తావు**
**ఐదు రూపాయలు భోజనం చేసే వారంటే అంత తెలుసా?**
**రోజువారీగా ఎంతమందికి ఏర్పాటు.. ఎంతమందికి పంపిణీ**
**ప్రభుత్వ పథకమే అయినా పరిశీలించని అధికారులు**



**పోడూరు అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి):** కోటి విద్యలు కూటి కొరకే.. పట్టెడన్నం కోసం ఎన్నో పాట్లు గమనించి నాడు టిడిపి ప్రభుత్వం, నేడు కూటమి ప్రభుత్వం ఐదు రూపాయలకే పేదల కడుపు నింపాలన్న ఉద్దేశంతో అన్న క్యాంటీన్లను రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసింది. ఈ పథకం ఎందరికో ఆకలి బాధను తీరుస్తోంది. ఇంతటి ప్రజాదరణ పొందిన పథకాన్ని పట్టించుకునే నాథుడే కురువయ్యారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు కన్నితైన చూడరు. అన్నా క్యాంటీన్లకు ఎంతమందికి భోజనం వస్తుంది రోజువారీగా ఎంతమందికి పంపిణీ చేస్తున్నారు అనేది బహిరంగ రహస్యం. ఎవరూ పట్టించుకోరని ధీమాతోనే సిబ్బంది నిర్వహణ అంతా మా ఇష్టం అన్నట్లుగా ప్రజలకు పూర్తిస్థాయిలో కడుపునింపలేకపోతోంది.

**ఆచంటలో తీరు.. నెరవేరని ప్రభుత్వ లక్ష్యం**

భోజనం మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభిస్తే గంటలోనే 250 మందికి భోజన పదార్థాలు వడ్డించి పదార్థాలు నిండుకున్నాయి ఇక చాలు వేనుతిరగండి అన్నట్లుగా సిబ్బంది వ్యవహరించడం ఆచంట అన్నా క్యాంటీన్లో ఆకలి కేకలు వినిపిస్తున్నాయి. పథకంలో నిర్వహణ లోపమా పథకం అమలుపై నిర్లక్ష్యమో తెలియని దుస్థితి అంటూ ప్రజానీకం గగ్గోలు పెడుతున్నారు. ఐదు రూపాయలకే భోజనం చేసేవారు అలుసు అన్నట్లుగా అన్నం, కూర, సాంబారు లో పరిమాణం ఎంత? ఏ సమయానికి ప్రారంభిస్తున్నారు ఏ సమయానికి ముగిస్తున్నారు వంటి విషయాలను కూటమి నాయకులు పరిశీలించకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. కూటమి ప్రభుత్వం అమలు చేసిన ప్రతిష్టాత్మకమైన పథకం అందరికీ అందని ద్రాక్షగా మారడం నాయకులు పట్టించుకోకపోవడం ప్రభుత్వ ఉద్దేశం నెరవేరడం లేదు. బుధవారం మధ్యాహ్నం 12.15 గంటల తర్వాత భోజన పదార్థాలు వడ్డించడం ప్రారంభించి ఒంటిగంటలోపే నిండుకోవడం పట్ల అడిగేవారే కరవయ్యారు. గంటలోపు 250 మందికి భోజన పదార్థాలు వడ్డించి పదార్థాలు నిండుకున్నాయని చెప్పడం సరికాదని వెనుతిరిగిన ప్రజానీకం ప్రశ్నిస్తున్నారు. నిర్వాహకులను వివరణ కోరగా పరిశీలించి అందరికీ భోజన పదార్థాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# షాది ఖానా అభివృద్ధికి సహకరించిన మాజీ మంత్రి బుగ్గన పై ఆరోపణలు చేయడం సరికాదు వైసిపి ముస్లిం మైనార్టీ నాయకులు



**బేతంచెర్ల: అక్టోబర్7(ప్రజా జ్యోతి)** బేతంచెర్లపట్టణంలోని షాదీఖానా భూమిపూజ మొదలుకొని నిర్మాణం పూర్తయ్యే వరకు మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అందించిన సహకారాన్ని మరచి ఆయనపై టీడీపీ ముస్లిం నాయకులు విమర్శలు చేయడం తగదని వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు రాష్ట్ర ఉర్దూ అకాడమీ మాజీ డైరెక్టర్ ముర్తుజావలి, రాష్ట్ర మైనార్టీ ఫైవ్ లాక్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కాజా హుస్సేన్, టౌన్ కన్వీనర్ పిట్టల జాకీర్ హుస్సేన్, కౌన్సిలర్ ఇబ్రహీం అన్నారు. బేతంచెర్ల పట్టణ ముస్లిం మైనార్టీల సౌకర్యార్థం నిర్మించిన షాదీఖానా భవనానికి భూమిపూజ నుంచి నిర్మాణం పూర్తయ్యే వరకు మాజీ మంత్రి బుగ్గన ప్రత్యేక చొరవ చూపారని వారు పేర్కొన్నారు. షాదీఖానా అభివృద్ధికి సహకరించిన బుగ్గనపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టకుండా కేవలం ఆరోపణలు చేయడం టీడీపీ నాయకులకు తగదని విమర్శించారు. ఇతర ప్రాంతాల నుంచి బేతంచెర్లకు వచ్చి వ్యాపారాలు నిర్వహిస్తూ స్థానిక మాజీ మంత్రిపై అనవసర ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ముస్లిం మైనార్టీల అభివృద్ధికి కృషి చేసిన నాయకులపై విమర్శలు చేయడం మానుకోవాలని వారు సూచించారు. ఇప్పుడు మీ ప్రభుత్వం ఉంది కదా బేతచెర్ల లో మరో షాది ఖానాను నిర్మించి ముస్లింలకు ఉపయోగపడేలా చేయండి మేము కూడా సంతోషిస్తాము అంతేగాని పక్కింటి వారి బిడ్డను నా బిడ్డ అనడం టిడిపి వారికి అలవాటైపోయింది అని ఉన్నారు.డోన్ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి మన రాష్ట్రంలో ఏ నియోజకవర్గంలో జరగలేదు తెలుసుకోని మాట్లాడండి. కార్యక్రమంలో వైసిపి ముస్లిం మైనారిటీ నాయకులు ప్లాట్ల దస్తగిరి, అల్తాఫ్, సునీల్,సందాని, సలీం, కాజా, వలి భాష, రియాజ్, ఫిరోజ్, షేక్ హుస్సేన్, అల్లబకాష్, షమీవుల్లా, బషీర్, ఆర్టీసీ అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

## తల్లి బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే తాజా కూరగాయలు తినాలి.. అంగన్వాడి టీచర్ కే కామాక్షి



**కౌతాళం అక్టోబర్ 07 ప్రజా జ్యోతి** పోషకల్లో కూడిన తాజా ఆకుకూరలు కూరగాయలను ప్రతి రోజు తీసుకుంటే తల్లి బిడ్డ ఇద్దరు ఆరోగ్యంగా ఉండడానికి అవకాశం ఉంటుందని అంగన్వాడీ టీచర్ కే. కామాక్షి అన్నారు.శిశు సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు సెప్టెంబర్ 25వ తేదీ నుంచి అక్టోబర్ 7వ తేదీ వరకు నిర్వహించే అంగన్వాడి ఉత్సవం కార్యక్రమంలో భాగంగా బుధవారం కౌతాళం మండలం పరిధిలోని మెలగనూరు గ్రామంలో అంగన్వాడి ఉత్సవం కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ పెద్దలు స్కూల్ హెచ్ఎం హాజరయ్యారు.వారు మాట్లాడుతూ అంగన్వాడి నుంచి అందించే మోషకాలను క్రమ తప్పకుండా తీసుకొవాలని వారు సూచించారు.తర్వాత హెచ్ఎం మేనేజర్ ఆశ వర్కర్ కు శాలవాకప్పి పుష్ప గుచ్చం అందజేసి అభినందించారు.ఈ కార్యక్రమంలో గర్భవతులు, బాలింతలు గ్రామ ప్రజలు అందరూ పాల్గొన్నారు.

## విబిజి రామ్‌జీ పనుల్లో లేబర్ మొబిలైజేషన్ పెంచాలి

- ఎంపీడీఓ జవహర్ బాబు



**దువ్వూరు, అక్టోబర్ 07 ( ప్రజా జ్యోతి )** విబిజి రామ్‌జీ పనుల్లో లేబర్ మొబిలైజేషన్‌ను గణనీయంగా పెంచాలని ఎంపీడీవో జవహర్ బాబు ఉపాధి హామీ సిబ్బందిని ఆదేశించారు. దువ్వూరు మండల పరిషత్ కార్యాలయంలో వి.బి.జి. రామ్‌జీ పనుల పురోగతిపై బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, మండలంలోని పలు గ్రామాల్లో రోజువారీ లక్ష్యానికి అనుగుణంగా కూలీల హాజరు లేకపోవడం గమనించామని తెలిపారు. క్షేత్రస్థాయి సిబ్బంది గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి కూలీలను సమీకరించి, ఉపాధి పనుల్లో లేబర్ మొబిలైజేషన్‌ను పెంచేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.అదేవిధంగా పశువులకు గడ్డి పెంపకం కోసం ఆసక్తి ఉన్న రైతుల నుంచి దరఖాస్తులను త్వరితగతిన స్వీకరించి, అర్హులైన రైతులకు పనులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. 2027--28 సంవత్సరానికి సంబంధించిన వి.బి.జి. రామ్‌జీ పనుల గుర్తింపు, ప్రణాళిక ప్రక్రియను డిసెంబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు.హార్టికల్చర్ కింద పనులు మంజూరైన రైతుల పొలాల్లో సంబంధిత ఫిట్టింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. మంజూరైన పనులు క్షేత్రస్థాయిలో జాప్యం లేకుండా ప్రారంభించి, నిర్దేశిత సమయంలో పూర్తి చేసేలా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు.లేబర్ మొబిలైజేషన్ లో ఆశించిన స్థాయిలో పనితీరు కనబరచని ఫీల్డ్ అసిస్టెంట్లు,టెక్నికల్ అసిస్టెంట్లకు హెచ్చరికలతో షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఎంపీడీవో తెలిపారు. సంబంధిత సిబ్బంది తమ పనితీరును తక్షణమే మెరుగుపరచుకోవాలని, పనితీరులో మార్పు లేకపోతే తొలగింపు నోటీసులు జారీ చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏపీవో లక్ష్మీనారాయణ, ఇసీ ప్రియాంక, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు



**ప్రజా జ్యోతి న్యూస్ ప్యాపిలి అక్టోబర్ 07** మండల పరిధిలోని కల్చట్ల, పెద్దపూజల్ల, చిన్నపూజర్ల గ్రామాలను ప్యాపిలి సీఐ వెంకటరామ్ రెడ్డి,ఎస్సై నాగార్జున బుధవారం సందర్శించి గ్రామస్తులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే ఫేక్ లోన్ యాప్స్, లోన్ మోసాలు, సైబర్ మోసాలు, ఉద్యోగ మోసాలు తదితర వాటిపై ప్రజలకు అవగాహన కల్పించారు. అదేవిధంగా రోడ్డు భద్రత, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రమాదాలు, హెల్మెట్ మరియు సీట్ బెల్ట్ వినియోగం, మైనర్లు వాహనాలు నడపకుండా చూడడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.మహిళలపై నేరాలు, బాల్య వివాహాలు జరగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, బాల్య వివాహాల సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100/112కు, సైబర్ నేరాలకు గురైనప్పుడు లేదా అనుమానాస్పద సైబర్ లావాదేవీలు జరిగిన వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి, మోసాలకు గురికాకుండా తమ వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలను ఇతరులతో పంచుకోవద్దని, అనుమానాస్పద లింకులు, యాప్స్, ఫోన్ కాల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచించారు.

# విలేకరి రమేష్ పై దాడి దారుణం

-- బాధితుడు రమేష్‌కు పరామర్శల వెల్లువ



**కాకినాడ జిల్లా అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** ప్రత్తిపాడు మండల విలేకరి సిగిరెడ్డి రమేష్‌ను బుధవారం పలువురు రాజకీయ ప్రముఖులు, విద్యావేత్తలు, పాత్రికేయులు పరామర్శించారు. ఇటీవల వార్తల సేకరణలో భాగంగా విధి నిర్వహణలో ఉన్న రమేష్‌పై కొందరు అసాంఘిక శక్తులు దాడికి పాల్పడటంతో ఆయన గాయపడిన సంగతి తెలిసిందే. ఆసుపత్రిలో చికిత్స పొంది, ప్రస్తుతం తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను పలువురు నేరుగా కలసి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. రమేష్‌ను పరామర్శించిన వారిలో రాష్ట్ర ఖాదీ, చిన్న పరిశ్రమల కార్పొరేషన్ వైస్ చైర్మన్ కొమ్మల కన్నబాబు, రాచపల్లి చంటి రాజు, అఖిల్ విద్యా సంస్థల చైర్మన్ ఐ. గంగాధర్‌తో పాటు మీడియా ప్రతినిధులు దాకరపు కృష్ణ, వాసు, బాలు తదితరులు ఉన్నారు.ఈ సందర్భంగా ప్రముఖులు మాట్లాడుతూ సమాజంలో నిజాన్ని నిర్భయంగా వెలికితీసే విలేకరులపై దాడులకు పాల్పడటం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు లాంటిదని ఆందోళన వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో ఉన్న విలేకరులకు పూర్తి రక్షణ కల్పించాల్సిన బాధ్యత పోలీసు యంత్రాంగంపై ఉందన్నారు. రమేష్‌పై దాడికి పాల్పడిన నిందితులను వెంటనే గుర్తించి, వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రమేష్‌కు తామంతా అండగా ఉంటామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

# అగ్నిప్రమాదంలో గాయపడిన చిన్నారులను పరామర్శించిన బిఆర్ఎస్ నాయకులు ప్రదీప్ రావు



**ములుగు** ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం బుట్టాయిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తూరు గ్రామానికి చెందిన కుమ్మరి రమేష్, నాగలక్ష్మి దంపతుల చిన్నారులు నిహస్వి (5), నిహాంత్ (2) ప్రమాదవశాత్తు చెత్తకుప్పల మంటలు తాకి తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే.ఈ విషయం తెలుసుకున్న ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు ఆదేశాల మేరకు, వారి సోదరుడు కాకులమర్రి ప్రదీప్ రావు హనుమకొండలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులను నేరుగా వెళ్లి పరామర్శించారు.ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని, అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పి, తమ వంతుగా తక్షణ ఆర్థిక సహాయం అందజేశారు. చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలని, బిఆర్ఎస్ పార్టీ కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటుందని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక బిఆర్ఎస్ పార్టీ నాయకులు కావిరి చిన్నికృష్ణ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ కోతలపై మండలంలో రైతుల ధర్నా

**సిద్ధిపేట :** వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాలు ఏర్పడుతున్నాయని ఆరోపిస్తూ రైతులు ఆందోళనకు దిగారు. విద్యుత్ కోతలను నిరసిస్తూ రాయపోల్ మండలం చేగుంట?గజ్వేల్ ప్రధాన రహదారిపై రైతులు బైఠాయించి ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. గుర్రాల సోఫా, వీరనగర్ చౌరస్తాల వద్ద రైతులు పెద్ద సంఖ్యలో చేరుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ.. రేవంత్ రెడ్డి డౌన్ డౌన్ నినాదాలు చేశారు. అలాగే విద్యుత్ శాఖకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వ్యవసాయానికి అవసరమైన సమయంలో విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పంటలకు నీరు అందించేందుకు విద్యుత్ కోసం ఎదురు చూడాల్సి వస్తోందని, గంటల తరబడి కోతలు విధిస్తుండటంతో సాగు తీవ్రంగా దెబ్బతింటోందని పేర్కొన్నారు. చేతికొచ్చిన పంటలు విద్యుత్ సరఫరా లేక నష్టపోయే పరిస్థితి నెలకొందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించే వరకు కదిలేది లేదని స్పష్టం వ్యవసాయానికి నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని రైతులు డిమాండ్ చేశారు. విద్యుత్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని స్పష్టమైన హామీ ఇచ్చే వరకు ఆందోళన విరమించేది లేదని తేల్చిచెప్పారు. రైతుల రాస్తారోకోతో చేగుంట?గజ్వేల్ ప్రధాన రహదారిపై ఇరువైపులా వాహనాలు భారీగా నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు, వాహనదారులు కొంతసేపు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రైతులను సముదాయించే ప్రయత్నం చేశారు. అయితే విద్యుత్ సమస్య పరిష్కారంపై స్పష్టమైన హామీ వచ్చే వరకు ఆందోళన కొనసాగిస్తామని రైతులు స్పష్టం చేశారు.

## రోగుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలి:

సిఐ వెంకటరామిరెడ్డి
ఎస్ఐ నాగార్జున



**ప్రజా జ్యోతి న్యూస్ ప్యాపిలి అక్టోబర్ 07** ఆర్ఎంపీ డాక్టర్లు రోగుల పట్ల బాధ్యతగా, మానవతా దృక్పథంతో వ్యవహరించాలని ప్యాపిలి సిఐ వెంకట్రాంరెడ్డి, ఎస్సై నాగార్జున అన్నారు. బుధవారం పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో సీఐ వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆర్ఎంపీ డాక్టర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ మండలంలో ఆర్ఎంపీ డాక్టర్లు అర్హతకు మించి వైద్యం చేయకూడదని, ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని, రోగుల ప్రాణభద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, పరిధికి మించిన కేసులను ప్రభుత్వ ఆసుపత్రులకు రెఫర్ చేయాలన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందేలా సంబంధిత అధికారులతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

## పాండవులపాలెం గిరిజన సంక్షేమ ఆశ్రమం బాలికల ఉన్నత పాఠశాలలో 'వన్యప్రాణి వారోత్సవాలు'

--విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు
-- బహుమతుల ప్రదానం



**కాకినాడ జిల్లా అక్టోబర్ 07( ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** మండలంలో పాండవులపాలెం గిరిజన సంక్షేమ ఆశ్రమం బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం వన్యప్రాణి వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు "అడవి వన్యప్రాణుల సంరక్షణ" అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏలేశ్వరం ఫారెస్ట్ రేంజ్ అధికారి (ఎఫ్ఆర్వో) దుర్గా రామ్ ప్రసాద్ మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో అడవులు, వన్యప్రాణుల పాత్ర అత్యంత కీలకమైందని తెలిపారు. అడవుల వల్ల కలిగే ఉపయోగాలు, మానవాళికి వన్యప్రాణుల అవశ్యకతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ ఆశ్రమం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ అబ్బయిరెడ్డి శంఖవరం ఫారెస్ట్ సెక్షన్ అధికారి జి. నాగేశ్వరరావు, రౌతులపూడి సెక్షన్ ఫారెస్ట్ అధికారి పి. శ్యామ్ కుమార్, అటవీ శాఖ సిబ్బంది సిహెచ్. బోరమ్మ పి. లావణ్య, కె. భీమశంకరం, వై. రాజ్ కుమార్, డి. శ్రీవిద్య, కె. మూర్తి, సూరా సాహెబ్, నూక రత్నం ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## కౌతాళం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాల్సిందే... వైసీపీ మండల వైస్ ప్రెసిడెంట్ ఆర్ ఎం సుధాకర్ రెడ్డి




**కౌతాళం అక్టోబర్ 07 ప్రజా జ్యోతి** మండల కేంద్రమైన కౌతాళంలో బుధవారం జరిగిన నిరువధిక సమ్మెలో భాగంగా కౌతాళం వైసిపి వైస్ ప్రెసిడెంట్ ఆర్ ఎం సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ కౌతాళం మండలాన్ని కచ్చితంగా కరువు మండలం ప్రకటించాల్సిందే ఎందుకంటే రైతులు వర్షం వస్తుందని ఆశతో పెట్టుబడి పెట్టడం జరిగింది చివారికి మంచి సమయంలో వర్షం రాకపోవడంతో పెట్టిన ఖర్చు కూడా వస్తుందా లేదని ఆందోళన చెందుతా ఉన్నారు. ఇలా అయితే రైతులు బ్రతకడం చాలా కష్టం కావున రైతులు అప్పుల పాలవుతున్నారు. కనీసం ప్రభుత్వం గుర్తించి కౌతాళం మండలాన్ని కరువు మండలంగా గుర్తించాలని వైసిపి మండల వైస్ ప్రెసిడెంట్ ఆర్ ఎం సుధాకర్ రెడ్డి తెలిపారు.

## నందికోట్కూరు 6వ వార్డులో వైసీపీ ప్రచారం



**ప్రజా జ్యోతి నందికొట్కూరు** నందికొటూరు పట్టణంలోని 6వ వార్డులో వైసీపీ నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ఆదేశాల మేరకు పట్టణ అధ్యక్షులు మన్సూర్ వార్డులో పర్యటించి స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా వైసీపీ కౌన్సిలర్ అభ్యర్థి బైరాపురం ఫయాజ్ను బలపరచాలని నాయకులు ఇంటింటికీ తిరుగుతూ స్థానిక ప్రజలను కలిసి మద్దతు కోరారు. వార్డులోని సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకుంటూ, ప్రజలతో మమేకమై ప్రచారం కొనసాగించారు. అభ్యర్థి గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని మన్సూర్ సూచించారు.ఈ కార్యక్రమంలో బద్దల శ్రీకాంత్,జావీద్ , చిన్న కృష్ణ, అబ్దుల్లా, అజాం,6వ వార్డు వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# దాండియాలో అన్య మతస్తుల పాల్గొంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి

**కొండా శ్రీకాంత్ బజరంగ్ దళ్ కన్వీనర్**

తెలంగాణ ప్రాంతం




దసరా నవరాత్రి ఉత్సవాల్లో ఘనంగా నిర్వహించే దాండియా కార్యక్రమంలో ఇస్లాం, ఇతర మతస్తుల పాల్గొంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని తెలంగాణ స్టేట్ బజరంగ్ దళ్ కన్వీనర్ కొండా శ్రీకాంత్ హెచ్చరికలు జారీ చేశారు. బుధవారం కోఠిలోనివిశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర కార్యాలయంలో విలేకర్ల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి కేంద్ర మందిర ప్రబంధ సమితి సభ్యులు ముసాపేట రామరాజు, బజరంగ్ దళ్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ కొండా, భాగ్యలక్ష్మి విభాగ్ బజరంగ్ దళ్ కన్వీనర్ అఖిల్, ప్రచార ప్రసార ప్రాంత సోషల్ మీడియా ప్రముఖ్ దీరజ్, అభిషేక్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మూసాపేట రామరాజు మాట్లాడుతూ దుర్గా నవరాత్రుల సందర్భంగా అమ్మవారిని అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో కన్నుల పండుగగా పూజిస్తాం. దానితో పాటు కొన్నిచోట్ల దాండియా, గర్భ కార్యక్రమాన్ని అత్యంత వైభవోపేతంగా నిర్వహిస్తున్నాం. కానీ ఈ కార్యక్రమంలో అన్య మతానికి సంబంధించిన వారు అక్రమంగా చొరబడి ఆధార్ కార్డులో హిందువులుగా పేర్లు మార్చుకొని, వారి కట్టు బొట్టు విషయాల్లో కూడా ఏ మాత్రం హిందువులకు తగ్గకుండా మార్పులు చేసుకొని పాల్గొంటున్నారు. ఇందులో పాల్గొని అక్కడ ఉన్న హిందూ మహిళల్ని, అమ్మాయిల్ని టార్గెట్‌గా చేసుకొని లవ్ జిహాద్‌కు గురి చేస్తున్నారన్నారు. ఇలాంటి దుస్సాహసాన్ని విశ్వ హిందూ పరిషత్ ఎప్పటికీ సహించబోదని తీవ్రంగా హెచ్చరించారు. కొండా శ్రీకాంత్ మాట్లాడుతూ... దాండియా నృత్యంలో ఆధార్ కార్డు మార్పులు చేసుకొని మేము హిందువులం అని అసత్య మాటలు చెప్పి హిందు అమ్మాయిల్ని, మహిళల్ని మభ్యపెట్టి వారిని ప్రేమ పేరుతో లోబర్చుకొని అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారు. ఇస్లాం మత గ్రంథంలో పేర్కొన్నట్టుగా హిందువులు అంటే కాఫీర్లు అని, వారితో స్నేహం చేయడం, వారి దేవీ దేవతలను పూజించడం, వారి అన్న ప్రసాదాలను తినడం ఇస్లాం మతానికి విరుద్ధం అని చెప్తున్నారు. కానీ ఇన్ని నీతులు చెప్తున్న వారు హిందువులు చేసే కార్యక్రమంలో ఎందుకు పాల్గొంటున్నారని ప్రశ్నించారు. వారి టార్గెట్ ఏమిటి? మీకు అంతలా హిందువుల కార్యక్రమంలో పాల్గొనాలని అనిపిస్తే ముందుగా మీరు మీ సోదరీ సోదరులను కూడా ఈ కార్యక్రమానికి తీసుకురండి. వారితో మా హిందూ యువకులు కూడా కలిసి దాండియా నృత్యం ఆడుతారని తెలియజేశారు. ఇలా చేయలేని పక్షంలో మీరు హిందువులుగా ఘర్ వాపస్ ద్వారా హిందువులుగా మారి ఈ కార్యక్రమంలో ఎలాంటి అభ్యంతరం లేకుండా పాల్గొనవచ్చని తెలిపారు. దాండియా కార్యక్రమాన్ని నిర్వహించే నిర్వాహకులకు విశ్వ హిందూ పరిషత్-బజరంగ్ దళ్ తరపున తీవ్రమైన హెచ్చరిక తెలియజేస్తున్నాం. మీరు కనుక ఈ కార్యక్రమంలోకి వచ్చేవారి ఆధార్ కార్డులను క్షుణ్ణంగా పరిశీలించి వారి వేష భాషలను కూడా పరిగణలోకి తీసుకొని వారు హిందువులు కాని ఎడల వారిని తక్షణమే పోలీసులకు లేదా మా కార్యకర్తలకు సమాచారం ఇవ్వవలసిందిగా తెలిపారు. అలాగే ఈ కార్యక్రమానికి బౌన్సర్లను కూడా ఎట్టి పరిస్థితుల్లో కేవలం హిందువులను మాత్రమే రక్షణగా ఉంచవలసిందిగా, హిందువులు కాని వారిని ఉంచితే కార్యక్రమ నిర్వహణను తప్పకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు.

# కొనసాగుతున్న రుతుపవనాల నిష్క్రమణ



**హైదరాబాద్ :** తెలుగురాష్ట్రాలకు భారత వాతావరణ శాఖ చల్లటి కబురు చెప్పింది. శీతాకాలంలో కూడా వేసవి తల పించే ఉక్కపోత నుంచి తెలుగురాష్ట్రాల ప్రజలకు ఉపశమనం కల్పిస్తూ.. నేడు ఏపీ, తెలంగాణలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. బంగాళాకాతంలోని ఉపరితల ఆవర్తనం, నైరుతి రుతుపవనాల ఉపసంహరణ కొనసాగుతున్న ప్రభావంతో ఈ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. అలాగే కొన్ని ప్రాంతాల్లో పొడి వాతావరణం, మరికొన్ని ప్రాంతాల్లో ఉక్కపోతలు కూడా ఉంటాయని స్పష్టం చేసింది. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో ఉదయం పూట ఆహ్లాదకరమైన చల్లని వాతావరణం, చల్లటి గాలులు వీస్తాయని.. మధ్యాహ్నం మాత్రం నిన్నటితో పోల్చుకుంటే ఒకటి రెండు రేట్లు ఎక్కువగానే ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని అంచానా వేసింది. దీంతో మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు నగరవాసుల ఉక్కపోతను ఎదుర్కోవసి రావచ్చు.. ఇక సాయంత్రం మళ్లీ వాతావరణం మారుతుంది. సాయంత్రం సమయంలో నగరంలో చాలా ప్రాంతాల్లో తేలిపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఇక రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పలు జిల్లాల్లో కూడా ఇదే తరహా వాతావరణం ఉంటుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. కొన్ని జిల్లాల్లో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, రంగారెడ్డిలో మాత్రం నేడు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే ఛాన్స్ ఉందని తెలిపింది. వర్షాల సమయంటో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు కూడా వీస్తాయని అంచనా వేసింది. బంగాళాఖాతంలోని ఉపరితల ఆవర్తనం ప్రభావంతో నేడు ఏపీలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే చాన్స్ ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ముఖ్యంగా తీరప్రాంత జిల్లాలైన విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళంలో మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలు పడే ఛాన్స్ ఉందని అంచానా వేసింది. అలాగే దక్షిణ కోస్తా, రాయలసీమలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

## మ్యూల్ ఖాతాలు అందిస్తున్న 100 మందికి పైగా అరెస్ట్
## ఐదు రాష్ట్రాల్లో ఏకకాలంలో సోదాలు



**హైదరాబాద్ :** సైబర్ నేరగాళ్లకు సహకరిస్తున్న ముఠాలపై సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఉక్కుపాదం మోపింది. గత రెండు వారాలుగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా పలు దక్షిణ రాష్ట్రాల్లో చేపట్టిన మెగా ఆపరేషన్‌లో 100 మందికి పైగా ఏజెంట్లను అరెస్టు చేసింది. సైబర్ మోసగాళ్లకు 'మ్యూల్' బ్యాంకు ఖాతాలు, కేవైసీ పత్రాలు సరఫరా చేస్తున్నారనే ఆరోపణలపై వీరిని అదుపులోకి తీసుకున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో బ్యూరో ప్రత్యేక బృందాలు సోదాలు నిర్వహించాయి. నిందితుల నుంచి మ్యూల్ ఖాతాలకు సంబంధించిన డెబిట్ కార్డులు, బ్యాంకు పాస్‌బుక్‌లను స్వాధీనం చేసుకున్నారు. దేశవ్యాప్తంగా నమోదైన అనేక సైబర్ క్రైమ్ కేసులతో ఈ నెట్‌వర్క్‌కు సంబంధాలు ఉన్నట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. ఇటీవల హైదరాబాద్‌కు చెందిన ఓ వైద్యుడిని మోసం చేసి రూ. 11 కోట్లు కాజేసిన కేసు దర్యాప్తులో ఈ అరెస్టులు కీలకంగా మారాయి. బాధితుడి నుంచి దోచుకున్న డబ్బును ఈ మ్యూల్ ఖాతాల్లోకే బదిలీ చేసినట్లు అధికారులు గుర్తించారు. అరెస్ట్ అయిన వారందరినీ ట్రాన్సిట్ వారెంట్లపై హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. ఈ మోసాల వెనుక దుబాయ్, ఇతర దేశాల్లోని సైబర్ నేరగాళ్ల హస్తం ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. ఆన్‌లైన్ మోసాల ద్వారా సంపాదించిన డబ్బును దాచిపెట్టడానికి, తరలించడానికి సైబర్ నేరగాళ్లు ఈ మ్యూల్ ఖాతాలను ఉపయోగిస్తుంటారు. ఫిషింగ్, పెట్టుబడి మోసాల ద్వారా కొల్లగొట్టిన డబ్బును అసలు సూత్రధారులెవరో తెలియకుండా చేసేందుకు ఈ ఖాతాలు మాధ్యమంగా పనిచేస్తాయి. ఈ కేసులో మరింత లోతుగా దర్యాప్తు చేసి, ప్రధాన నిందితులను గుర్తించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు.

## నా వీడియోలను మార్ఫింగ్ చేశారు:
### బీఆర్ఎస్‌పై భువనగిరి ఎంపీ చామల కిరణ్ ఫైర్

**హైదరాబాద్ :** తెలంగాణలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం తీవ్రస్థాయికి చేరుకుంది. తాజాగా, తనపై బీఆర్ఎస్ నేతలు సోషల్ మీడియా వేదికగా ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తున్నారని భువనగిరి కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరులపై తాను వ్యతిరేకంగా మాట్లాడినట్లు తన వాయిస్‌ను, వీడియోలను ట్యాంపరింగ్ చేసి సర్క్యులేట్ చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన చామల... బీఆర్ఎస్ నేతల పదేళ్ల అక్రమాస్తులను తాను బయటపెడుతున్నందుకే ఇలాంటి నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. "బీఆర్ఎస్ నేతల అవినీతిని ప్రశ్నిస్తున్నందుకే నాపై కక్షగట్టి మార్ఫింగ్ వీడియోలతో దాడి చేస్తున్నారు. ఈ కుట్రల వెనుక ఉన్న వారిపై కచ్చితంగా కేసులు పెడతాను" అని ఆయన హెచ్చరించారు. ఈ ఘటనపై టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్ కూడా స్పందించారు. ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డిపై మార్ఫింగ్ వీడియోలు సృష్టించిన వారిని వెంటనే అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అయితే ఈ ఆరోపణలపై బీఆర్ఎస్ పార్టీ నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక స్పందన రాలేదు. తెలంగాణ రాజకీయాల్లో మార్ఫింగ్ వీడియోల వివాదం మరోసారి చర్చనీయాంశంగా మారింది.

## హైదరాబాద్‌లో 30 మంది ముస్లిం ఓటర్ల తొలగింపు యత్నం

**హైదరాబాద్ :** హైదరాబాద్‌లో ఓటర్ల జాబితా నుంచి 30 మంది ముస్లింల పేర్లను అక్రమంగా తొలగించేందుకు ప్రయత్నించారనే ఆరోపణలపై బీజేపీ బూత్ లెవల్ ఏజెంట్‌పై కేసు నమోదైంది. ముషీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో చోటుచేసుకున్న ఈ ఘటన రాజకీయంగా కలకలం రేపుతోంది. వివరాల్లోకి వెళితే, ముషీరాబాద్ నియోజకవర్గంలోని సూర్య నగర్ పోలింగ్ స్టేషన్ నెం. 210 పరిధిలో ఎస్. బాలచందర్ అనే బీజేపీ బూత్ ఏజెంట్, 30 మంది ఓటర్ల పేర్లను తొలగించాలని కోరుతూ సెప్టెంబర్ 28న ఫారం-7 దరఖాస్తులను సమర్పించారు. బాధితులంతా ముస్లిం వర్గానికి చెందినవారే. అధికారులు వాటిని మూకుమ్మడిగా స్వీకరించేందుకు నిరాకరించడంతో, అతను ఆ పత్రాలను అక్కడే వదిలివెళ్లినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై ముషీరాబాద్ నియోజకవర్గ ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి (ఈఆర్ఓ) టి. ప్రవీణ్ కుమార్ చిక్కడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్షేత్రస్థాయిలో ఎన్నికల అధికారులు జరిపిన విచారణలో ఆ 30 మంది ఓటర్లు వారి చిరునామాల్లోనే నివసిస్తున్నట్లు నిర్ధారణ అయింది.

## శంఖవరంలో వైసీపీకి జోష్.. 55, కుటుంబాలు చేరిక
### కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ముద్రగడ గిరిబాబు



**శంఖవరం, అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి న్యూస్):** శంఖవరం గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి జోష్ పెరిగింది. శంఖవరం గ్రామానికి చెందిన 55 కుటుంబాలు వైఎస్సార్‌సీపీ సిద్ధాంతాలకు ఆకర్షితులై బుధవారం పార్టీలో చేరారు. పొలమాటి శాంతి భరత్, కనికెళ్ల బ్రెనేట్ బాబు, మణిబాబు ఆధ్వర్యంలో కిర్లంపూడిలోని ముద్రగడ నివాసానికి చేరుకున్న వారు ప్రత్తిపాడు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి ముద్రగడ గిరిబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గిరిబాబు వారికి వైసీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ముద్రగడ గిరిబాబు మాట్లాడుతూ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ ఐక్యంగా పనిచేయాలని కోరారు. కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. నూతనంగా పార్టీలో చేరిన వారు గిరిబాబు నాయకత్వంలో వైసీపీ బలోపేతానికి, పార్టీ అభివృద్ధికి ఐక్యంగా కృషి చేస్తామని తెలిపారు. ఈ చేరికలతో శంఖవరం గ్రామంలో వైసీపీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది.

## వైఎస్ జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన మాజీ ఎంపీపీ పర్వత రాజబాబు




**శంఖవరం, అక్టోబర్ 7 (ప్రజాజ్యోతి):** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మంగళవారం తాడేపల్లిలో శంఖవరం మాజీ తాజా ఎంపీపీ పర్వత రాజబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ని కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. పర్వత రాజబాబు శ్రీమతి జానకి దేవిని మరియు తనయుడు వివేక్ ని జగన్మోహన్ రెడ్డి ఆప్యాయంగా పలకరించారు అనంతరం నియోజకవర్గంలోని తాజా రాజకీయ పరిస్థితులు, పార్టీ కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై ఇరువురి మధ్య చర్చ జరిగినట్లు తెలిసింది. ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని చర్చించినట్లు సమాచారం. ఎంపీపీ పర్వత రాజబాబు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలవడం స్థానికంగా రాజకీయ వర్గాల్లో ఆసక్తిని కలిగించింది.

## స్మార్ట్ కిచెన్‌ను పరిశీలించిన డిఈఓ షంషుద్దీన్



**దువ్వూరు, అక్టోబర్07 ( ప్రజా జ్యోతి )** దువ్వూరు మండల కేంద్రంలోని ప్రాథమికోన్నత పాఠశాలను బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్ సందర్శించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం నిర్వహిస్తున్న స్మార్ట్ కిచెన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కిచెన్ సిబ్బందికి పలు సూచనలు తెలిపారు. వంటకు తాజా కూరగాయలను మాత్రమే ఉపయోగించాలి. బియ్యాన్ని శుభ్రంగా కడిగి వంట చేయాలి. పరిశుభ్రత విషయం లో తగు జాగ్రత్తలు పాటించాలి. విద్యార్థులకు రుచికరమైన, పౌష్టికాహారాన్ని అందించాలి. ఎటువంటి పొరపాట్లకు తావు ఇవ్వకూడదు. సకాలంలో అన్ని పాఠశాలలకు మధ్యాహ్న భోజనం చేరేలా చూడాలి అని మండల విద్యాశాఖ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు రమణయ్య, భాస్కర్ మరియు ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు సిబ్బంది పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో తగ్గిన బస్సు చార్జీలు

**హైదరాబాద్ :** హైదరాబాద్ ప్రజలకు టీజీఎస్ఆర్టీసీ దసరా రానున్న క్రమంలో శుభవార్త అందించింది. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు తిరుగుతున్న పుష్పక్ బస్సుల్లో ఛార్జీలకు సంబంధించి ఆర్టీసీ అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. పుష్పక్ బస్సుల్లో ఛార్జీలను భారీగా తగ్గిస్తున్నట్లు ప్రకటించారు. ఏకంగా ఛార్జీలను 40 శాతం వరకు తగ్గిస్తున్నట్లు గ్రేటర్ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అంచూరి శ్రీధర్ ప్రకటన జారీ చేశారు. బుధవారం నుంచే ఈ చార్జీలను అమలు చేయనున్నట్లు స్పష్టం చేశారు. ఈ తగ్గింపు తర్వాత ఏయే ప్రాంతాల నుంచి ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లే బస్సుల్లో ఛార్జీలు ఎలా ఉన్నాయనేది ఒకసారి చూద్దాం. లింగంపల్లి నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ వరకు నడుస్తున్న పుష్పక్ బస్సుల్లో ఇప్పటివరకు చార్జీలు రూ. 350గా ఉండగా.. ఇప్పుడు రూ. 200కి తగ్గించారు. ఇక శిల్పారామం, గచ్చిబౌలి, కొత్తగూడ నుంచి ఎయిర్‌పోర్ట్ బస్సుల్లో రూ. 350 నుంచి రూ. 150కి తగ్గించినట్లు వెల్లడించారు. ఇక అల్విన్ ఎక్స్‌రోడ్ నుంచి మొన్నటివరకు రూ. 350 చార్జీ ఉండగా.. ఇప్పుడు రూ. 200కు తగ్గించారు. అలాగే మియాపూర్ ఎక్స్‌రోడ్ నుంచి ఎయిర్‌పోర్ట్‌కి వెళ్లే పుష్పక్ బస్సులో చార్జీ రూ. 350 ఉండగా.. రూ. 250కు తగ్గించారు. జేబీఎస్-శంషాబాద్ ఎయిర్పోర్ట్, జేఎన్‌టీయూ-ఎయిర్‌పోర్ట్ పుష్పక్ బస్సుల్లోనూన రూ. 350 నుంచి రూ. 200కి తగ్గించారు.

Printed by Sree Seshasai Enterprises Published by Vaddi Srinivas Reddy on behalf of Sai Krishna Publications, printed at # 3-88, Chandra Theater, Main Road, Gosala, Krishna District - 521151 Andhra Pradesh and published at D.No. 6-121, 1st Floor, Sphurthy Building, Gosala Village, Urdu School Street, Vijayawada, Krishna District-521151 Andhra Pradesh. Editor Vaddi Srinivas Reddy- 94402 31967 . PRGI No. APTEL/26/A0119,